చేదు స్మృతి చెరిగి... భక్తి భావన పెరిగి..

● తిరుమల ఘాట్ ఏడో మైలు వద్ద భద్రాంజనేయ విగ్రహం

8

విద్యాసంస్థల ఆవరణలో టపాసుల దుకాణాలు పెట్టొద్దు

తిరుపతి(విద్య), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల ఆవరణలోను, ఆయా విద్యాసంస్థల ఆట మైదానాల్లోనూ టపాసుల దుకాణాలు ఏర్పాటుచేయరాదని ఆర్ ఐవో ప్రభాకరరెడ్డి, డీఈవో శేఖర్ చెప్పారు. ప్రభుత్వ విద్యాసంస్థల ఆవరణలో టపాసుల దుకాణాలను ఏర్పాటుచేసేందుకు ఎక్కడా అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఒకవేళ ఎవరైనా ఏర్పాటుచేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రూ.247.65 లక్షల స్కూల్ గ్రాంట్స్ విడుదల

తిరుపతి(విద్య), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 2,219 పాఠశాలలకు కాంపోజిట్ నిధులు మంజూరయ్యాయి. మొత్తం రూ.495.3 లక్షలు మంజూరు కాగా.. తొలివిడత రూ.247.65 లక్షలు విడుదలయ్యాయి. ● జిల్లాలోని మండల రిసోర్స్ సెంటర్ల (ఎంఆర్సీ)కు ఒక్కోదానికి రూ.1.3 లక్షల చొప్పున రూ.44.2 లక్షలను విడుదల చేశారు. ఎంఆర్సీల నిర్వహణకు రూ. 30 వేలు, కాంటింజెన్సీ ఖర్చులకు రూ.30వేలు, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌కు రూ.30వేల చొప్పున ఖర్చు చేయాలని మార్గనిర్దేశం చేశారు.

క్వార్ట్జ్, సిలికా రవాణాకు

రైట్.. రైట్...



క్వార్ట్జ్ ఖనిజం

గూడూరు(అర్బన్), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా కొనసాగిన ఉల్లం'ఘనుల' కారణంగా నిలిచిపోయిన ఖనిజాల రవాణాకు ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ప్రభుత్వ అనుమతి పొందిన గనులు, క్వారీలు, ఎండీఎల్(మైనింగ్ డీలర్స్ లైసెన్స్)లు ప్రభుత్వ నిబంధనల లోబడి క్వార్ట్జ్, సిలికా శాండ్ వాటి అనుబంధ ఖనిజాలను రవాణా చేసుకునేందుకు అనుమతినిస్తూ తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది.

2019-24 కాలంలో నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అపారంగా ఉన్న క్వార్ట్జ్, సిలికా సాండ్ ఖనిజాలను వైసీపీ నేతలు విచ్చలవిడిగా కొల్లగొట్టారు. రెవెన్యూ, అటవీ తదితర ప్రభుత్వ, ప్రైవేటు భూములను యథేచ్ఛగా ధ్వంసం చేసి వేల కోట్ల విలువ చేసే ఖనిజాలను చైనా, మలేషియా, అరబ్ దేశాలకు తరలించేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీరి ఆగడాలకు అడ్డుకట్ట పడింది. అక్రమ మైనింగ్ దందాలను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి ఈ వ్యవహారాన్ని సీఐడీకి అప్పగించింది. అంతేగాక, గనుల నిర్వహణ, ఖనిజాల రవాణాలను తాత్కాలికంగా నిలిపివేస్తూ జూలైలో చర్యలు తీసుకుంది. ప్రస్తుతం అక్రమ మైనింగ్ పూర్తిగా అదుపులోకి రావడంతో తదుపరి చర్యలను ప్రభుత్వం మొదలు పెట్టింది. గనుల యజమానులు, ఖనిజాల డీలర్లు, కార్మికులు, వివిధ వర్గాల ప్రజల నుంచి పలు విజ్ఞాపనలు రావడంతో రవాణాకు అనుమతులు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం భూగర్భ గనులశాఖ ప్రధాన కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా సోమవారం ఈ మేరకు ఇచ్చిన ఉత్తర్వులు ఆయా జిల్లాల్లోని భూగర్భ, గనులశాఖ కార్యాలయాలకు మంగళవారం అందాయి. ఈ ఉత్తర్వుల ప్రకారం.. గతంలో ఎలాంటి ఉల్లంఘన (వైలేషన్స్)లను అతిక్రమించని వారికి మాత్రమే రవాణాకు అనుమతులు ఇవ్వాలని సూచించారు. పూర్తిగా మైనింగ్ ఉల్లంఘనలు అతిక్రమించిన వారితో పాటు కొద్దిగా పాటించని వారిని కూడాన పక్కన పెట్టేసి అనుమతులు నిరాకరించారు. ఉల్లంఘనలు తీవ్రతను బట్టి ఏపీఎంఎంసీ, ఎండీఎల్ నిబంధనల ప్రకారం అక్రమార్కులపై తదుపరి చర్యలు తీసుకుంటారు.

ఇకపై ఖనిజాల రవాణా ఇలా...

అనుమతి పొందిన గనులలో, ఎండీఎల్ పొందిన ప్రదేశాలలో ఖనిజాల నిల్వలను భూగర్భ గనులశాఖ అధికారులు పరిశీలించిన తరువాతే పర్మిట్లను మంజూరు చేస్తారు. రవాణా వాహనాలన్నీ నిఘా కెమెరాల పరిరక్షణలో బయలు దేరుతాయి. రవాణా చేసే వాహనాలన్నీ జియో పర్యవేక్షణలో ఉంటాయి. ఇకపై నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు హెచ్చరికలు జారీ చేశారు. ఖనిజాల రవాణాపై అడ్డంకులు తొలగడంపై గనుల యజమానులు, వ్యాపారులు, కార్మికుల్లో హర్షం వ్యక్తమవుతోంది.



రవాణాకు సిద్ధంగా ఉన్న క్వార్ట్జ్



ఎస్వీఆర్ డిస్టిలరీ లోపల సీఐడీ అధికారులు

ఎస్వీఆర్ డిస్టిలరీస్‌లో

సీఐడీ తనిఖీలు

- సోదాలలో పాల్గొన్న ఎక్సైజ్ అధికారులు
- పరదాలు వేసి
- మరీ రికార్డుల పరిశీలన
- మరో రెండు రోజులు కొనసాగే అవకాశం

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి సమీపం.. రేణిగుంట మండలం కరకంబాడి సమీపంలోని ఎస్వీఆర్ డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో సీఐడీ అధికారుల బృందం మంగళవారం తనిఖీలు చేపట్టింది. విజయవాడ నుంచి సీఐడీ డీఎస్పీ పద్మలత ఆధ్వర్యంలో సుమారు పది మంది సభ్యుల బృందం ఉదయం 11 గంటలకు డిస్టిలరీ ఎకు చేరుకుంది. వీరితోపాటు తిరుపతి సీఐడీ.. ఎక్సైజ్ అధికారులు కూడా ఉన్నారు. ఈ డిస్టిలరీస్‌ను నెల్లూరు జిల్లాకు సంబంధించి మద్యం వ్యాపారంతో సుదీర్ఘకాలంగా సంబంధాలున్న ఓ రాజకీయ ప్రముఖుడి కుటుంబం లీజుకు తీసుకుని నడుపుతున్నట్టు సమాచారం. సీఐడీ అధికారుల బృందం డిస్టిలరీ లోపలకు వెళ్లిన వెంటనే గేట్లకు పరదాలు కట్టి బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో మద్యం విక్రయాల్లో అవినీతి జరిగిందనే ఆరోపణలపై విచారణలో భాగంగా ఈ సోదాలు చేస్తున్నారు. 2019 అక్టోబరు నుంచి 2024 మార్చి వరకు.. ఏయే కంపెనీలకు.. ఏయే రకాల మద్యం, ఎంత పరిమాణంలో తయారు చేశారనే వివరాలు సేకరిస్తున్నారు. ఆయా కంపెనీలకు నెలవారీ తయారు చేసిన మద్యం.. ఎంత గోదాములకు సరఫరా అయింది? వృథా అయింది ఎంత? మిగిలిన స్టాక్ ఏం చేశారనేదీ విచారిస్తున్నారు. ఎక్స్ట్రా న్యూట్రల్ ఆల్కహాల్, బ్లెండ్ ఎక్కడి నుంచి తెప్పించారు? లిక్కర్ తయారీలో వాటిని ఎంత పరిమాణంలో కలిపారు? మిగిలిన స్టాక్‌ను ఏమి చేశారనేదీ ఆరా తీస్తున్నారు. డిస్టిలరీస్‌కు ఏయే మద్యం రకాల తయారీకి అనుమతులు ఉన్నాయి? వాటికి అనుగుణంగానే తయారు చేశారా? లేక ఉల్లంఘనలు జరిగాయా? అన్నది పరిశీలించారు. గత ఐదేళ్లలో మద్యం తయారీ, విక్రయాలపై రికార్డులను పరిశీలించి వివరాలు నమోదు చేస్తున్నారు. ఇక, తయారైన మద్యంలో ప్రతి 1000 లీటర్లకు ఎంత వేస్టేజ్ పోతోంది? దాన్ని ఏమి చేశారు? ధ్వంసం చేశారా లేకుంటే మళ్లీ చీప్ కింద విక్రయించారా అని ప్రశ్నించారు. కంపెనీ ప్రతినిధులు చెప్పే అన్ని వివరాలను రాత పూర్వకంగా రికార్డు చేస్తున్నారు. ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా వీడియోగ్రఫీ రికార్డింగ్ చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. డిస్టిలరీస్‌ను గత ఐదేళ్లలో ఎవరైనా లీజుకు తీసుకున్నారా? అన్న అంశంతో పాటు నిర్వహణకు సంబంధించి రిజిస్టర్లు ఉన్నాయా అన్నది విచారిస్తున్నారు.



డిస్టలరీ గేటుకు పరదాలు కట్టి లోపల చేపట్టిన తనిఖీలు

బాటిళ్లకు వేసే సీళ్లపైనా విచారణ

మద్యం బాటిళ్ల క్యాప్‌లపై వేసే సీళ్ల ఎక్కడి నుంచి.. ఎంత తెప్పించారు? ఎన్ని బాటిళ్లకు వాడారు? సీళ్ల మిగిలి ఉంటే ఏం చేశారనే దానిపైనా విచారణ సాగిస్తున్నారు. ఈ సీళ్లను ఎక్సైజ్ ఉన్నతాధికారుల అధీనంలో వున్న వాటిని తెప్పించి వేశారా? లేకుంటే కంపెనీ ఆధ్వర్యంలో కొనుగోలు చేశారా అన్నది ఆరా తీస్తున్నారు. మద్యానికి ఎక్సైజ్ డ్యూటీ చెల్లించారా లేదా అని కూడా రికార్డులు తనిఖీ చేస్తున్నారు. దాదాపు 12 గంటల పాటు సాగిన విచారణలో.. బాటిళ్లకు వేసిన లేబుళ్లు, మద్యం తయారీకి.. పంపిణీకి మధ్య వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారని విశ్వసనీయ సమాచారం. ఈ సోదాలు మరో రెండు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని తెలిసింది.

భగ్గుమన్న రాజకీయ కక్షలు

- నాంచారమ్మపేటలో టీడీపీ కార్యకర్త హత్య
- బైక్‌ను కాల్చివేసి.. దారుణానికి పాల్పడిన వైసీపీ కార్యకర్తలు
- గ్రామంలో ఉద్రిక్తత



కాలిపోయిన బైక్ - (ఇన్‌సెట్‌లో) మృతిచెందిన హరిప్రసాద్

చిల్లకూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రశాంతమైన గ్రామంలో రాజకీయ కక్షలు భగ్గుమన్నాయి. సార్వత్రిక ఎన్నికల ముందు వైసీపీ నుంచి ఆ యువకుడు టీడీపీలో చేరడం.. ఎన్నికల్లో ఆ గ్రామంలో టీడీపీకి అధిక మెజారిటీ రావడంతో కక్ష పెంచుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో మంగళవారం వేకువజామున ఆ యువకుడిని హతమార్చారు. దీంతో చిల్లకూరు మండలం నాచారమ్మపేటలో ఉద్రిక్తత నెలకొంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. కూలి పనులు చేసుకునే పెంచలయ్య, రమణమ్మ దంపతుల కుమారుడు హరిప్రసాద్(21). ఇతడు రాజకీయాల్లో చురుగ్గా ఉండేవాడు. వైసీపీలో ఉన్న సమయంలో.. మరో వర్గానికి చెందిన వారితో గొడవలు ఉండేవి. ఈ క్రమంలో ఎన్నికలకు ముందు టీడీపీలో చేరాడు. సోమవారం రాత్రి హరిప్రసాద్‌కు వైసీపీ కార్యకర్తలకు మధ్య వివాదం చోటు చేసుకుంది. మంగళవారం వేకువన గ్రామానికి చెందిన కట్టా రామచంద్రారెడ్డి అనుచరులైన నారపరెడ్డి వెంకటకృష్ణ, కట్టా రామిరెడ్డి, జలగం రాజేష్, దువ్వూరు దిలీప్‌రెడ్డి, మన్నెమాల మల్లి, దుంపల మధు, దుంపల భానుచంద్, దుంప సాయి, దుంపల సాయికుమార్, శనగ డానియేల్, మన్నెం హర్ష, మన్నెం సురేష్‌తో మరి కొంత మంది హరిప్రసాద్ ఇంటికెళ్లి బైకును తగలబెట్టారు. సీసాల్లో పెట్రోలు పోసి నిప్పంటించి హరిప్రసాద్ ఇంట్లోకి విసిరారు. ఇంట్లో మంటలు రాగానే నిద్రపోతున్న హరిప్రసాద్, అతడి సోదరుడు కాటయ్య బయటకు వచ్చారు. అదే సమయంలో వైసీపీ కార్యకర్తలు రాడ్లు, కర్రలతో దాడికి పాల్పడ్డారు. గాయపడిన కాటయ్య పారిపోగా.. తీవ్రగాయాలతో హరిప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఎస్పీ సుబ్బరాయుడు, ఏఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ రమణకుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. చిల్లకూరు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన కాటయ్య



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు

సహనంగా ఉన్నామే కానీ..: సోమిరెడ్డి

దళిత యువకుడు హరిప్రసాద్ హత్యకు కారణమైన వైసీపీ నాయకులను కఠినంగా శిక్షించేలా చర్యలు చేపడతామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించి.. ఏరియా ఆస్పత్రిలో హరిప్రసాద్ మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ అధినేత, సీఎం చంద్రబాబు చెప్పినట్లు తాము సహనంగా ఉన్నామే కానీ బలహీనంగా లేమన్నారు. సీఎంగా జగన్.. రాష్ట్రంలో హత్యా రాజకీయాలను ప్రోత్సహించి అన్ని వ్యవస్థలను నాశనం చేశారన్నారు. ఇప్పుడు ప్యాలెస్‌లో కూర్చొని శాంతి వచనాలు వల్లిస్తున్నారని ఆరోపించారు. తమ నాయకుడు శాంతియుతంగా ఉండమని చెప్పడంతోనే మౌనంగా ఉన్నామని, దీనిని అలుసుగా తీసుకుని వైసీపీ నాయకులు బరితెగిస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. హరిప్రసాద్ హత్యకు బాధ్యులైన వారికి చట్టబద్ధంగా శిక్షపడేలా చూస్తామన్నారు. అతడి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గాయపడిన కాటయ్యను, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాశం సునీల్‌కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, నెలవల విజయశ్రీ, తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, పెంచలకోన ఆలయ మాజీ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తానంకి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.5లక్షలు: ఎమ్మెల్యే

అంతకుముందు టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడారు. రాజకీయ కక్షలను టీడీపీ ప్రోత్సహించడం లేదన్నారు. గ్రామాల్లో వ్యక్తిగత తగాదాల్లోకి దళితులను లాగడం మంచిపద్ధతికాదన్నారు. తమ పార్టీ కార్యకర్త హరిప్రసాద్‌ను వైసీపీకి చెందిన వారు హత్య చేయడం దారుణమన్నారు. మృతుడి కుటుంబానికి రూ.5లక్షలు ఆర్థికసాయం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, వాటంబేడు శివకుమార్, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఏరియా ఆస్పత్రి వద్ద ఎమ్మెల్యేలు చంద్రమోహన్ రెడ్డి, రామకృష్ణ, సునీల్‌కుమార్, విజయశ్రీ

తెల్లారేసరికి మద్యం షాపులు



మంగళవారం ఉదయం 6.30కే దేవేంద్ర థియేటర్ రోడ్డులో మద్యం అమ్మకాలు



ఉదయం 9 గంటలకు తిలక్‌రోడ్డులో తెరచి ఉంచిన మద్యం షాపు

ప్రతిరోజూ ఉదయం పది నుంచి రాత్రి పది గంటల వరకు మద్యం షాపులు తెరవాలి. కానీ, తిరుపతిలో కొన్నింటిని ఉదయం ఆరున్నరకే తెరుస్తున్నారు. ఆ సమయానికే కొందరు మందుబాబులు వెళ్లి కొంటున్నారు. ప్రధానంగా తిరుపతిలోని దేవేంద్ర థియేటర్ రోడ్డు, తిలక్ రోడ్డు, వీవీ మహల్ రోడ్డు, బాలాజీ కాలనీ, వెంకటేశ్వర థియేటర్ రోడ్డు, మంగళం రోడ్డు, డీబీఆర్ ఆస్పత్రి తదితర ప్రాంతాల్లో ఇదే పరిస్థితి. కొన్ని చోట్ల రాత్రి 12 గంటలైనా మూతపడని పరిస్థితి నెలకొంది. సమయ పాలన పాటించకున్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి



సీఎం చంద్రబాబుతో ఐఐటీ అధికారులు

ఏపీ డ్రోన్ టెక్నాలజీ నాలెడ్జ్ పార్టనర్‌గా తిరుపతి ఐఐటీ

ఏర్పేడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్, డ్రోన్ టెక్నాలజీ పార్టనర్‌గా రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి ఐఐటీతో మంగళవారం ఒప్పందం కుదుర్చుకుంది. సీఎం చంద్రబాబు, ఐఐటీ అధికారులు విజయవాడలో పరస్పర ఒప్పందం కుదుర్చుకున్నారు. తిరుపతి ఐఐటీ ఇంటిగ్రేషన్, డిజిటల్ ట్విన్ టెక్నాలజీ, స్టార్టప్ సపోర్టు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ఎను ప్రోత్సహించడం వంటి కీలక రంగాల్లో సాంకేతిక అభివృద్ధిపై దృష్టి పెడుతోంది. తిరుపతి ఐఐటీతో రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఈ ఒప్పందం ఉమ్మడి పరిశోధన కార్యక్రమాలను నడపడానికి, పరిశ్రమలను బలోపేతం చేయడానికి, ఈ ప్రాంతంలో సాంకేతిక పురోగతులు, ఆవిష్కరణలు పెంపొందించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. విజయవాడలో మంగళవారం జరిగిన డ్రోన్ కాన్ఫరెన్సులో ఐఐటీ తిరుపతి నుంచి సుమారు 15మంది విద్యార్థులు, 8మంది అధ్యాపకులు హ్యాకథాన్‌లో పాల్గొన్నారు. ప్రాజెక్టు టైటిల్, ప్రకృతి వైపరీత్యాల సమయంలో నెట్‌వర్క్‌ను పునరుద్ధరించడానికి ఏరియల్ బేస్ స్టేషన్ అవసరమని ఐఐటీ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నరేంద్రనాథ్ సూచించారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం


పట్టుబడిన ఎర్రచందనంతో ఫారెస్టు అధికారులు

ఎర్రావారిపాలెం ,అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి); ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు చామల రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. మండలంలోని నెరబైలు పంచాయతీ పులిగోను పల్లె నుంచి ఎర్రచందనం స్మగ్లింగ్ జరుగుతుందని తమకు ముందస్తు సమాచారం అందిదన్నారు. సిబ్బందితో పులిగోను పల్లె సమీపంలో సోమవారం రాత్రి 2గంటలకు మాటు వేశామన్నారు. భాకరాపేట వైపుగా అతి వేగంగా ఓ కారు వెళ్తుండటాన్ని గుర్తించి ఆపేందుకు ప్రయత్నించామన్నారు. తాము వెంటాడగా తిరుపతి-పీలేరు జాతీయ రహదారి చిన్నగొట్టిగల్లు సమీపం కమ్మపల్లె వద్ద కారును ఆపి నిందితులు పారిపోయారన్నారు. కారుతో పాటు 181 కేజీల బరువున్న ఆరు ఎర్రచందన దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడిలో తనతోపాటు ఎఫ్‌బీఓలు నిఖిల్,ప్రదీప్ కుమార్,ప్రదీప్ చాంద్,రాజేష్, శంకర్,శ్రీనివాసులు పాల్గొన్నారని వెంకటరమణ వివరించారు

గతుకులమయంగా రామానుజపల్లె రోడ్డు



తిరుపతి రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలో నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారి నుంచి రామానుజపల్లె గ్రామానికి వెళ్లే రోడ్డు కంకర తేలి గుంతలమయంగా తయారైంది. జాతీయ రహదారి నుంచి గ్రామానికి ప్రవేశించే ముందువరకు ఈరోడ్డు మధ్యలో పలుచోట్ల అధ్వానంగా ఉంది. నిత్యం ఈమార్గంలో ఎక్కువ సంఖ్యలో ఇసుకట్రాక్టర్లు, టిప్పర్లు నడుస్తుంటాయి. అందువల్లే రోడ్డు దారుణంగా తయారైందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుగ్రామాల నుంచి రోజూ ఈమార్గంమీదుగానే పిల్లలను పాఠశాలలకు తీసుకువస్తుంటారు. చిన్నపాటి వర్షం కురిసినా గుంతల్లో నీరు నిలిచి అవస్థలు పడుతున్నారు. దీన్ని బాగుచేయాలని పలువురు కోరుతున్నారు.

'వెలుగు పూలకోసం' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ మోహిద్దీన్ షా,అధ్యాపకులు

పాకాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల అధ్యాపకుడు డాక్టర్ రమేష్ కుమార్ రచించిన వెలుగు పూలకోసం కవితాసంపుటిని మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ మోహిద్దీన్ బాషా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ సమాజాన్ని ముందుకు నడిపించేది కవిత్వమన్నారు. విద్యార్థులు పఠనాసక్తిని పెంపొందించుకోవాలన్నారు. పీలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, మదనపల్లె బీటీ కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ డి.శ్రీనివాసులు వెలుగు పూల కోసం పుస్తకంలోని కవితల్ని విశ్లేషించారు. కార్యక్రమంలో ఐరాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రెడ్డి రామరాజు, స్థానిక బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి, రచయిత రమేష్ కుమార్, ఈశ్వరబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిరుపేదలైన అర్హులకే ఇళ్ల స్థలాలు: టీడీపీ


మాట్లాడుతున్న శివకుమార్,తదితరులు

భాకరాపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వ హయాంలో అర్హులకే ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని చిన్నగొట్టిగల్లు క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్ అన్నారు. చిన్నగొట్టిగల్లులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో భాకరాపేటలో అనర్హులకు ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. వాటిని రెవెన్యూ అధికారులు పరిశీలిస్తుంటే వైసీపీ పత్రికలో కూటమి నాయకులు ఆక్రమిస్తున్నారని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. వీటిని ప్రజలు ఎవరూ నమ్మవద్దని కోరారు. నిరుపేదలకు ఇచ్చిన పట్టాలను వైసీపీ వారు దౌర్జన్యంగా తీసుకుని తమ పేర్లతో మార్చుకున్నారని ఆరోపించారు. టీడీపీ నాయకులు సహదేవరెడ్డి, రమేశ్‌రెడ్డి, హైదర్‌వలీ, కాకి వెంకటరమణ, సురేంద్ర నాయుడు, బెల్లంకొండ రమణ, చోటాసాహెబ్, జైచంద్రనాయుడు, చాన్‌బాషా, మల్లిఖార్జున, తదితరులు పాల్గొన్నారు.

●భాకరాపేటలో గతంలో లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్ల స్థలాల రికార్డులను రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్నారు. ఇటీవల కూటమి నాయకులు భాకరాపేటలో అక్రమ నిర్మాణాలు తొలగించాలని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రికార్డులను తహసీల్దారు కార్యాలయానికి తీసుకురావాలని స్థల యజమానులకు సూచించారు. లబ్ధిదారులు తీసుకువచ్చి అధికారులకు అప్పగించారు. వీటిని పరిశీలిస్తామని అధికారులు తెలిపారు.

తుఫాన్ ప్రభావంతో పలు రైళ్ల రద్దు

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో బుధవారం నుంచి మూడు రోజులపాటు (25వ తేదీ వరకు) పలు రైళ్లు రద్దు చేసినట్టు వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

23న: కన్యాకుమారి-డిబ్రుగర్ ఎక్స్‌ప్రెస్ (22503), పాండిచ్చేరి-హౌరా (12868), బెంగళూరు-హౌరా హంసఫర్ (22888), బెంగళూరు-హౌరా (12864), కామాఖ్య-బెంగళూరు ఏసీ ఎక్స్‌ప్రెస్ (12552), డిబ్రుగర్-కన్యాకుమారి వివేక్ (22504).

24న: తిరునెల్వేలి-షాలిమార్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ (06087), ఖరగ్‌పూర్-విల్లుపురం (22603), సంత్రాగచ్చి-మంగళూరు వివేక్ ఎక్స్‌ప్రెస్ (22851), హౌరా-బెంగళూరు (12863), పాట్నా-ఎర్నాకులం (22644), బెంగళూరు-హౌరా దురంతో (12246), పూరి-తిరుపతి (17479).

25వరకూ ఆధార్, బయోమెట్రిక్ సేవల శిబిరాలు

తిరుపతి రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలంలో ఈనెల 25వరకు నిర్వహించే ఆధార్ నమోదు, బయోమెట్రిక్ ప్రామాణీకరణ సేవల శిబిరాలను ఏర్పాటు చేశామని ఎంపీడీవో రామచంద్ర పేర్కొన్నారు. నిర్దిష్ట తేదీల్లో ప్రతి ఇల్లు, పాఠశాలను సందర్శించి ఆధార్ నమోదు చేయించాల్సిన వారి జాబితాని సేకరించి గ్రామసచివాలయాల పరిధిలో నమోదు చేయించాలని పంచాయతీ కార్యదర్శి సిబ్బందిని ఆదేశించామన్నారు. 5-15 సంవత్సరాల వారికి ఆధార్ నమోదు, ఆధార్‌కార్డులో చిరునామా, ఫొటో మార్పు, ఫోన్ నెంబర్ లింకు, వేలిముద్రల అప్‌డేట్ వంటి సేవలను వినియోగించుకోవాలని కోరారు. 23న గాంధీపురం, ధనలక్ష్మినగర్, వేదాంతపురం, పెరుమాళ్లపల్లె, పాడిపేట, రణధీరపురం, 24న సాయినగర్-1, మల్లంగుంట, వెంకటపతినగర్, యోగిమల్లవరం, మంగళం-2, 25న పద్మావతిపురం, తుమ్మలగుంట, పేరూరు, దామినేడు, తుడా క్వార్టర్స్ ప్రాంతాల్లో క్యాంప్‌లను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

చినుకు పడితే ఈ మార్గంలో వెళ్లడం కష్టమే..



తిరుపతి అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి గ్రామీణ మండలం మంగళం పరిధిలోని బొమ్మల క్వార్టర్స్ చివరివీధిలో రోడ్డుపై వర్షపు నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కరకంబాడి ప్రధాన రహదారికి వీధికి మధ్యలో కొంతవరకు మట్టి రోడ్డు ఉంది. వర్షం కురిసిన సమయంలో వాహనాల తాకిడికి మట్టి కొట్టుకుపోయింది. దీంతో అక్కడ గుంతలా మారి వర్షపు నీరు రోజుల తరబడి నిల్వ ఉంటోంది. రోడ్డుపైకి రావాలంటే వాహనదారులు మినహా మిగతా వారు నీటిలో అడుగు పెట్టేందుకు అవస్థలు పడుతున్నారు. అంచుల్లో పిచ్చిమొక్కలు ఏపుగా ఉండడంతో నడిచేందుకు వీలుపడలేదు. ఈ సమస్య పరిష్కరించాలని సంబంధిత విభాగాలను, ప్రజాప్రతినిధులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

శ్రీవారిసేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి


జస్టిస్ భాస్కర్‌రెడ్డి

తిరుమల, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలోని రంగనాయక మండపానికి చేరుకున్న జస్టిస్ భాస్కర్‌రెడ్డికి వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. తెలంగాణ ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు మంగళవారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో దర్శనం చేసుకున్నారు.

తలకోనలో సర్దార్ -2 షూటింగ్

ఎర్రావారిపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి); జిల్లాలోని పర్యాటక కేంద్రం తలకోనలో సర్దార్ -2 తమిళ సినిమా చిత్రీకరణ జరుగుతోంది. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో కార్తి, మాలవీకలు హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. మంగళవారం తలకోన పరిసరాల్లో ఫైట్ల సన్నివేశాలు చిత్రీకరించారు. ఇక్కడ వారం రోజుల పాటు షూటింగ్ చేయనున్నారు. చిత్రానికి యవన్ శంకర్ రాజా సంగీతం సమకూర్చుతున్నారు. పరిసరాల్లోకి ఎవరినీ అనుమతించడం లేదు.

పీహెచ్‌డీ ప్రదానం


విద్యాలతాదేవి

తిరుపతి రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కాంచీపురానికి చెందిన చంద్రశేఖర సరస్వతి విశ్వమహా విద్యాలయ హిందీవిభాగ పరిశోధక విద్యార్థి విద్యాలతాదేవికి పీహెచ్‌డీని ప్రదానం చేసింది. వర్సిటీకి చెందిన సంస్కృత,భారత సాంస్కృతిక (హిందీ)విభాగ అధ్యాపకుడు డాక్టర్ డి.నాగేశ్వరరావు మార్గదర్శకంలో పరిశోధనాగ్రంథం సమర్పించినందుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు సీవోఈ పేర్కొన్నారు.
ఈమె తిరుపతిలోని భారతీయ విద్యాభవన్స్‌లో హిందీ టీచర్‌గా పనిచేస్తున్నారు.

రైతులకు సబ్సిడీపై డ్రిప్ సాగు పరికరాలు

ఎర్రావారిపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) మండలంలో రైతులనకు సూక్ష్మ నీటి పారుదల సాగుకు రాయితీపై ప్రభుత్వం డ్రిప్ పరికారాలు సమకూర్చుతోందని ఈ సంస్థ జిల్లా అధికారి సతీష్ తెలిపారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా కమలయ్యగారి పల్లెలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డ్రిప్ వల్ల సాగుతో రైతు ఎరువులు,నీరు ఖర్చులు ఆదా అవుతాయన్నారు. కార్యక్రమంలో అధికారులు ఖాదర్ భాషా, శివకుమారి,పలువురు రైతులే పాల్గొన్నారు.

11 నుంచి రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు

చంద్రగిరి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తొండవాడ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో నవంబరు 11 నుంచి 20వరకు రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు నిర్వహించనున్నారు. తొలిరోజు ఉదయం స్వామి అమ్మవార్లకు అభిషేకం, అగస్త్యేశ్వరస్వామికి విభూది అభిషేకం, సాయంత్రం భూమిపూజ నిర్వహిస్తారు. మర్నాడు అంకురార్పణ, కలశస్థాపన, మండపారాధన, గణపతి హోమం, ధ్వజారోహణం, పూర్ణాహుతి జరుగుతాయి. రోజూ వివిధ పూజలు నిర్వహించనున్నారు. 20న త్రిశూలస్నానం, సాయంత్రం ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.82 కోట్లు

తిరుమల, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.82 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం వివరాలను టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది. సోమవారం 64,894 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

రబీ ఆశలపై నీళ్లు చల్లుతున్న చెరువులు


రెండేళ్లుగా బీటలు వారిన బాదూరు చెరువు

రామచంద్రాపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నీరు లేని చెరువులు చూసి అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ యేడాదైనా రబీలో సాగునీరందుతుందని గంపెడాశలు పెట్టుకున్న వీరికి ప్రస్తుతానికి నిరాశే ఎదురవుతోంది. గత మూడేళ్లుగా సరైన వర్షాలు లేవు. దీంతో మండలంలోని 14 ఇరిగేషన్ చెరువులు అడుగంటిపోయాయి. ఈ నెల 14వ తేదీ నుంచి 17 వరకు వాయుగుండం నేపథ్యంలో భారీ వర్షాలు కురుస్తాయని ఎదురుచూశారు. ఇందుకు తగ్గట్లుగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ముందస్తు ఏర్పాట్లు చేసింది. ఈసారైనా చెరువులు నిండుతాయని భావించారు. అయితే వర్షాలు ఆశించిన మేర కురవలేదు. వాయుగుండం ఊరించి ఉసూరుమనిపించింది. రబీసాగుపై పెట్టుకున్న ఆశలు సన్నగిల్లుతున్నాయని రైతులు చెబుతున్నారు. 2021లో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని చెరువులు నిండాయి. కానీ గత ప్రభుత్వం ఐదేళ్ల పాటూ చెరువుల నిర్వహణకు ఒకపైసా విదల్చలేదు. దీంతో ఏడాదిలోపు చెరువులన్నీ ఖాళీ అయ్యాయి. తర్వాత రెండేళ్లుగా సరైన వర్షాలు కురవడంలేదు. చెరువుల్లో ముళ్లపొదలు ఏర్పడ్డాయి. కట్టలు కూడా బలహీనపడ్డాయి. అక్టోబరు నుంచి నవంబరు లోపు చెరువులు నిండితేనే రబీ సాగుకు రైతులు సమాయత్తమవుతారు. ఇప్పటివరకు ఈనెలలో వర్షానికి వంకలు, వాగుల్లో నీరు చేరలేదు. నవంబరులో భారీ వర్షాలు కురిసి చెరువులునిండితే తప్పా సాగు చేయలేమని రైతులు అంటున్నారు. ఈనెల 15 నుంచి రబీ సాగు ప్రారంభమవుతుండగా చెరువుల్లో నీరు లేక రైతుల్లో ఉత్సాహం కనిపించడంలేదు.

ఎక్కడా నీరు చేరలేదు



నాకు ఆరు ఎకరాల పొలం ఉంది. మా ఊరి చెరువు రెండేళ్లుగా ఎండిపోయింది. వర్షాలు కురవకపోవడంతో బావులు, చెరువుల్లో నీరుచేరలేదు. ఈ దఫా సాగుపై ఎలాంటి నిర్ణయం ఇంకా తీసుకోలేదు.

-బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, కుప్పం బాదూరు

రబీ సాగు అనుమానమే



ఈనెలలో భారీ వర్షాలు కురిసి చెరువులు ఈ పాటికే సగానికి పైగా నిండాల్సి ఉంది. అనుపల్లి నుంచి వచ్చే సుద్దేటివంకలో కనీస నీటి నిల్వ కూడా లేదు. నవంబరులో వర్షాలు లేకపోతే రబీ సాగు ప్రశ్నార్థకమే.

-దేశిరెడ్డి, రైతు, తాలేపల్లి

భూ సేకరణలో బాధిత రైతులందరికీ న్యాయం చేయాలి: నాని


జేసీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు, నాయుడుపేట జాతీయ రహదారి విస్తరణలో భూములు ,ఇళ్లు కోల్పోయిన రైతులందరికీ న్యాయం చేయాలని చిత్తూరు జేసీ విద్యాధరిని ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారు. కుక్కలపల్లి నుంచి మల్లవరం వరకు జాతీయ రహదారిలో భూసేకరణపై ఆమె మంగళవారం చంద్రగిరి తహసీల్దార్ కార్యాలయంలో బాధితులతో సమావేశమయ్యారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సరైన న్యాయం జరగక బాధితులు కోర్టును ఆశ్రయించారన్నారు. వారికి ఇంటి స్థలాలు కూడా సక్రమంగా పంపిణీ చేయలేదన్నారు. పనపాకం వద్ద ఫ్లైఓవర్ సమీపంలో 80 మంది రైతులకు మూడు సెంట్ల ఇంటి స్థలాలను మంజూరు చేయాల్సి ఉన్నా ఇంతవరకు న్యాయం జరగలేదన్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా రైతులకు ఎక్కువ భూములు లేక పోవడంతో ప్రస్తుత ధరలను అనుసరించి నష్టపరిహారం అందించాలని కోరారు. సవేవటీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, రమేష్‌రెడ్డి, బాలకృష్ణమూర్తి, గౌస్‌బాషా, జనసేన నాయకులు దేవర మనోహర్, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో కాలం చెల్లిన చిక్కీల గుర్తింపు


కాలపరిమితి ముగిసిన చిక్కీలు, స్టోర్ రూం తనిఖీ చేస్తున్న న్యాయవాదులు

పాకాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాల మేరకు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది మంగళవారం పాకాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. స్టోరూంలో సరుకులను, కోడిగుడ్లను తనిఖీ చేశారు. కాల పరిమితి ముగిసిన చిక్కీలను గుర్తించారు. చిక్కీలపై సెప్టెంబరు నెలాఖరుకు కాలపరిమితి ముగుస్తుందని ముద్రితమై ఉంది. తయారు,చేసిన 60 రోజుల లోపు వినియోగించాల్సి ఉంది అయినా 9 బాక్సుల చిక్కీలు నిల్వ వున్నట్లు గుర్తించారు. స్టోర్ రూం శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పిల్లలకు తాజా కూరగాయలు, నాణ్యమైన సరకులతో వండి వడ్డించాలని ఇన్‌చార్జి హెచ్‌ఎం రమేష్‌బాబుకు సూచించారు. న్యాయవాదులు .చంద్రమోహన్, సునీల్, కోర్టు సిబ్బంది మదుసూదన్, మీనా పాల్గొన్నారు.

కంచి పీఠం సందర్శన


విజయేంద్ర సరస్వతి స్వామి ఆశీస్సులు తీసుకుంటున్న టీటీడీ ఈవో

తిరుమల, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవో శ్యామలరావు కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి ఆశీస్సులు పొందారు. తిరుపతిలోని వినాయక నగర్ క్వార్టర్స్ వద్ద కంచి మఠాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈక్రమంలో సమాజ శ్రేయస్సు కోసం టీటీడీ చేపట్టాల్సిన పలు ధార్మిక కార్యక్రమాలపై విజయేంద్ర స్వామి పలు సూచనలు చేశారు. ఈవో వెంట అన్నమాచార్య ప్రాజెక్ట్ డైరెక్టర్ విభీషణ శర్మ, ఇతర అధికారులు ఉన్నారు.

అన్నప్రసాదాల నాణ్యతపై అదనపు ఈవో ఆరా

తిరుమల, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ నిత్యాన్నప్రసాద భవనంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అన్నప్రసాదాల నాణ్యత, రుచి విషయంలో టీటీడీ ఇటీవల అనేక చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈక్రమంలో అన్నప్రసాద భవనంలోని హాలుకు వెళ్లి అన్నప్రసాదాలు వడ్డించే తీరును పరిశీలించారు. అన్నప్రసాదాలు నాణ్యత, రుచి ఎలా ఉందంటూ భక్తులను అడిగి తెలుసుకున్నారు. ఆయన భక్తులతో కలిసి భోజనం చేశారు. నాణ్యత బాగుందని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. రాజేంద్ర, శాస్త్రి పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ సంస్థ మార్పు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ చూసిన విజయవాడకు చెందిన ఎస్‌ఎస్‌వీ ఎంటర్‌ప్రైజెస్ సంస్థకు ఆర్టీసీ యాజమాన్యం స్వస్తిపలికింది. డ్రైవర్లకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం, డ్యూటీలు కేటాయించకపోవడం, పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపచేయకపోవడం వంటి కారణాలతో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. దాంతో పలుమార్లు ధర్నా చేస్తూ, డ్యూటీలు చేయకుండా భైఠాయించడం వంటి సంఘటనలు చోటుచేసుకునేవి. ఈ సమస్య అధికారులకు తలనొప్పిగా మారడంతో స్పందించి చర్యలు చేపట్టారు. మరో సంస్థను ఆహ్వానించగా, న్యూఢిల్లీకి చెందిన ప్రముఖ ఎస్ అండ్‌ఏ ప్రొటెక్షన్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ముందుకు రావడంతో మంగళవారం నుంచి బాధ్యతలను అప్పగించింది. ఈ సందర్భంగా డీపీటీవో జగదీష్ ఆ సంస్థ ప్రతినిధులతో సమావేశమై ఆర్టీసీ నిబంధనలను తూచా తప్పక పాటించాలని, డ్రైవర్లకు ప్రతినెల 10వతేది లోపు చెల్లింపు, ఇతర ప్రయోజనాల వర్తింపు చేయాలని కోరారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో 50 ఎలక్ట్రిక్ బస్సులు తిరుపతి-తిరుమల మధ్య నడవనున్నాయి.

ఆధునిక పద్ధతుల్లో సాగు


మాట్లాడుతున్న బిందుమాధవి

రామచంద్రాపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించి అధిక దిగుబడులు సాధించాలని మాజీ ఎంపీపీ బిందుమాధవి అన్నారు. మండలంలోని అనుపల్లి పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రైతులు ప్రభుత్వం రాయితీలో అందిస్తున్న డ్రిప్ ఇరిగేషన్, ఎరువులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో స్రవంతి, పశువైద్యాధికారి హేమకుమార్, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ రంగయ్య, పలుశాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వివేక్ ఎక్స్‌ప్రెస్‌కు రేణిగుంటలో హాల్ట్

వేళచ్చేరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైలు బోగీల్లో నీరు నింపేందుకు వివేక్ ఎక్స్‌ప్రెస్ 10 నిమిషాలు రేణిగుంట రైల్వేస్టేషన్‌లో ఆగనుంది. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... నెం.22504 డిబ్రూగర్-కన్నియాకుమారి వివేక్ ఎక్స్‌ప్రెస్ రేణిగుంటకు వేకువజామున 3 గంటలకు చేరుకొని 3.10 నిమిషాలకు బయల్దేరుతుంది. అలాగే, నెం.22503 కన్నియాకుమారి-డిబ్రూగర్ వివేక్ ఎక్స్‌ప్రెస్ రేణిగుంటకు మధ్యాహ్నం 12.10 గంటలకు చేరుకొని 12.20 గంటలకు బయల్దేరి వెళుతుంది. ఈ సమయాల మార్పు బుధవారం నుంచి అమలుకు రానున్నాయి.

తెలుగుగంగ క్వాలిటీ కంట్రోల్ ఈఈగా శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి తెలుగు గంగ కార్యాలయంలో క్వాలిటీ కంట్రోల్ ఈఈగా ఆర్.శ్రీకాంత్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు పోస్టింగ్ కోసం వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న శ్రీకాంత్‌రెడ్డిని తెలుగు గంగ ప్రాజెక్ట్ తిరుపతి కార్యాలయంలోని డిజైన్స్ అండ్ లైజనింగ్ డివిజన్ క్వాలిటీ కంట్రోల్ ఈఈగా నియమించారు.

కనీస వేతన చట్టం అమలయ్యేలా చర్యలు తీసుకోండి: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కనీస వేతన చట్టం అమలు అయ్యేలా కార్మికశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం రాత్రి కనీస వేతనాల సవరణకు సంబంధించి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్‌ఎంఆర్, మజ్దూర్ కార్మికుల కనీస వేతనాలు అమలయ్యేలా అధికారులు నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. అన్‌స్కిల్డ్ ఎంప్లాయిమెంట్ కింద గ్రామీణ ప్రాంతాల్లో రోజువారీ వేతనం రూ.538, పురపాలక సంఘ పరిధిలో రూ.621, కార్పొరేషన్ పరిధిలో రూ.677 వేతనాలుగా, సెమి స్కిల్డ్ ఎంప్లాయిమెంట్ కింద గ్రామీణ ప్రాంతాల్లో రూ.565, పురపాలకసంఘంలో 652, కార్పొరేషన్‌లో రూ.712 వేతనాలుగా, స్కిల్డ్ ఎంప్లాయిమెంట్ కింద గ్రామీణ ప్రాంతాల్లో రోజువారీవేతనం రూ.594, పురపాలకసంఘం రూ.685, కార్పొరేషన్‌లలో రూ.749గా వేతనాలు 2024 ఏప్రిల్ 1 నుంచి జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో కనీస వేతనాలు అమలు అవుతాయనితెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ లేబర్ కమిషనర్ ఓంకార్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ చిన్న లాలప్ప, ఆర్డీవోలు రామ్మోహన్, కిరణ్మయి, భానుప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●పాలిటెక్నిక్ డిప్లమో, ఐటీఐ కళాశాలల్లో స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి పరిశ్రమల్లో ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో మంగళవారం ఆయన సమీక్షించారు. దీనికి జిల్లా కమిటీని నియమించారు. జిల్లాపరిశ్రమల అధికారి కన్వీనర్‌గా మహిళా యూనివర్శిటీ వీసీ కో కన్వీనర్‌గా, మెప్మా, డీఆర్‌డీఏ పీడీలు, నైపుణ్యాభివృద్ధి అధికారి, ఎల్డీఎం, ఏపీఐఐసీ అధికారులు, హ్యాండ్‌లూమ్స్, పాలిటెక్నిక్, ఐటీఐ వారిని కమిటీ సభ్యులుగా ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత కోర్సుల్లో శిక్షణ పొందిన యువతకు సదరు పరిశ్రమల్లో ఉపాధి కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, జిల్ల పరిశ్రమలశాఖ ఇన్‌ఛార్జి అధికారి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, మెప్మా పీడీ రాధమ్మ, లోకనాథం, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

వేడుకగా ప్రాకారోత్సవం

శ్రీకాళహస్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న కాలభైరవ స్వామికి మంగళవారం ప్రాకారోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ముందుగా కాలభైరవ స్వామి సన్నిధిని శుద్ధి చేశారు. అనంతరం మంగళ వాయిద్యాలు మేళతాళాల మధ్య అభిషేకాలు, ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. కాలభైరవ స్వామి ఉత్సవమూర్తిని మహాద్వారం నుంచి విజయస్తూపం వరకు ప్రదక్షిణగా తీసుకెళ్లి తిరిగి ఆలయంలో కొలువు తీర్చారు. అలాగే పదహారు కాళ్ల మండపంలో కొలువై ఉన్న ఆంజనేయుడిని వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకించి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం సిందూరం దిద్ది పుష్పాలతో అలంకరించారు.

ప్రకృతి సోయగం





తిరుపతిలో మంగళవారం సాయంత్రం ఆకాశం నీలి మేఘాలతో విస్తరించి శేషాచల కొండను చుట్టుముట్టాయి. ఆ తర్వాత వర్షం కురిసిన సమయంలో ఆకాశంలో మెరుస్తున్న దృశ్యం ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంది. - తిరుపతి అర్బన్

నగరంలో భారీ వర్షం



వర్షంలో తడుస్తూ వెళుతున్న ప్రజలు

తిరుపతి(లీలామహల్), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం సాయంత్రం అరగంటపాటు భారీ వర్షం కురిసింది. పగలంతా ఉక్కపోతతో ఉన్న వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. అయితే వర్షం కారణంగా కూలీలు సాయంత్రం ఇళ్లకు చేరడానికి, రోడ్లపై వ్యాపారాలు చేసుకునే దుకాణదారులు ఇబ్బంది పడ్డారు. ఆటోలు, ద్విచక్ర వాహన దారులు, పాదచారుల ప్రయాణం మాత్రం ఆగలేదు. యువతీ, యువకులు గొడుగుల చాటున పరుగులు పెట్టారు. గాంధీరోడ్డు, బాలాజీకాలనీ, ఎంఆర్.పల్లె, బస్టాండు, కర్ణాలవీధితో పాటు పలు రోడ్లు జలమయమయ్యాయి.

చిన్నపిల్లల ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయండి

టీటీడీ జేఈవో గౌతమి



పనులను పరిశీలిస్తున్న టీటీడీ జేఈవో గౌతమి

తిరుపతి(వైద్యం), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లల ఆస్పత్రి నిర్మాణ పనుల్లో వేగవంతం పెంచి, మరో ఐదు నెలల్లో (మార్చి నాటికి) చిన్నారులకు వైద్య సేవలు అందించేందుకు అందుబాటులోకి తీసుకురావాలని టీటీడీ జేఈవో గౌతమి అధికారులను ఆదేశించారు. అలిపిరి జూపార్కు రోడ్డులో టీటీడీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీపద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటికే టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో మెరుగైన గుండె వైద్య సేవలు అందిస్తూ ఎంతో మంది చిన్నారుల ప్రాణాలను నిలబెడుతున్నారన్నారు. ఈ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలతో చిన్నారులకు అన్ని రకాల జబ్బులకు వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు టీటీడీ కృషి చేస్తుందన్నారు. అంతకుముందు ఆమె ఆస్పత్రి నిర్మాణ పనులపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, సీఈ సత్యనారాయణ, శ్రీపద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈలు కృష్ణారెడ్డి, మల్లికార్జున ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

షాట్‌పుట్‌లో బంగారు పతకం



ప్రణీత్‌కుమార్‌ను అభినందిస్తున్న దృశ్యం

తిరుపతి అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గత వారం గుంటూరులో జరిగిన 35వ సౌత్ జోన్ జూనియర్ నేషనల్ అథ్లెటిక్ మీట్‌లో తిరుపతికి చెందిన క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. అండర్ 16 బాలుర విభాగంలో షాట్‌పుట్‌లో బి.ప్రణీత్‌కుమార్ ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించాడు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గిరిధర్‌రాజు, రాబర్ట్, కోచ్ ప్రసాద్‌లు మంగళవారం ప్రణీత్‌కుమార్‌ను అభినందించి, మరిన్ని పతకాలు కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న భానుప్రకాష్‌రెడ్డి, పీసీ రాయలు

తిరుపతి అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్‌షా 60వ జన్మదినం సందర్భంగా స్థానిక గాంధీరోడ్డులోని కస్తూర్బాగాంధీ ట్రస్టు చైర్మన్ పీసీ రాయలు ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకులు భానుప్రకాష్‌రెడ్డి హాజరై కేక్‌కట్ చేసి, సంబరాలు జరుపుకున్నారు. మునిరత్నం నాయుడు, బండి మధుసూదనరెడ్డి, ఎం.ఉమాపతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులకు ఆయుధపూజ



అలంకరణలో ఎలక్ట్రిక్ బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అలిపిరి ఆర్టీసీ డిపోలో మంగళవారం ఉదయం శాస్త్రోక్తంగా ఆయుధపూజ నిర్వహించారు. డీపీటీవో జగదీష్ ముఖ్యఅతిథిగా హాజరై సిబ్బంది పనితీరును అభినందించారు. . ఈ సందర్భంగా మెకానిక్ సెక్షన్, పనిముట్లు, బస్సులు, బ్యాటరీ రీఛార్జ్ స్టేషన్ తదితరాలను శుభ్రం చేసి శోభాయమానంగా అలంకరించారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, సీఎంఈ నరసింహులు, ఏటీఎం రామచంద్ర నాయుడు, డీఎంలు హరిబాబు, భాస్కర్, బాలాజీ, యూనియన్ నాయకులు, కండక్టర్లు, డ్రైవర్లు, సెక్యూరిటీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

టీటీడీ లగేజీ కార్మికులకు న్యాయం చేయండి



ఈవో శ్యామలరావుకు వినతిపత్రం అందజేస్తున్న నవీన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి (జీవకోన), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): టీటీడీలో పనిచేస్తున్న లగేజీ కార్మికులకు న్యాయం చేయాలని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి కోరారు. మంగళవారం టీటీడీ పరిపాలనా భవనంలో కార్మికులతో కలిసి ఆయన ఈవో శ్యామలరావుకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ నడిచివెళ్లే భక్తుల లగేజీని అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గం ద్వారా తిరుమలకు భద్రంగా చేరవేస్తున్న సుమారు 350మంది కార్మికులు 15 సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేవలం రూ.10వేలు వారికి ఇస్తున్నారని, శ్రీలక్ష్మీ శ్రీనివాస పవర్ కార్పొరేషన్‌లో విలీనం చేసి కార్మికులందరికీ జీతాలు పెంచాలని కోరారు. తిరుమల తిరుపతిలోని స్థానికులకు ప్రతినెల మొదటి మంగళవారం ఆధార్‌కార్డు ఆధారంగా శ్రీవారి దర్శన భాగ్యం కల్పించాలని కోరారు. పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈవో శ్యామలరావు సానుకూలంగా స్పందించినట్లు నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

గ్రామాల్లో మౌలిక వసతులకు అగ్రాసనం

రూ.3.92కోట్లతో అభివృద్ధి ● పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే నాని



అభివృద్ధి పనులకు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుపతి అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి గ్రామీణ మండలంలో రూ.3.92కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. మంగళంలో అభివృద్ధి పనులకు ఆయన మంగళవారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 'పల్లె పండుగ-ప్రగతికి అండగా నిలుస్తుంద న్నారు. గ్రామాల అభివృద్ధిలో గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన ఐదునెలల్లోనే తిరుమలనగర్, మంగళం, రణధీరపురం, లింగేశ్వర్‌నగర్, అవిలాల, తిరుచానూరులలో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించామన్నారు. సీసీరోడ్లు, సైడుకాలువలు నిర్మిస్తామని చెప్పారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత నిస్తున్నామన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దోబీఘాట్ మార్గాన్ని పరిశీలించి త్వరలోనే పునర్నిర్మిస్తామని హామీ ఇచ్చారు. సప్తగిరికాలనీకి అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఆదేశించారు.అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఎంపీడీవో రామచంద్ర, మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, వేమూరు మధు, బడి సుధాయాదవ్, పెరుగు భాస్కర్‌రెడ్డి, సురేష్ నాయుడు, చలపతి, బాలాజీప్రసాద్, రామకృష్ణ, నాగరాజు, సురేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సౌకర్యాలపై వృద్ధులకు అవగాహన



వృద్ధులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తిరుపతి అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారిక మంత్రిత్వశాఖ ద్వారా వృద్ధులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు మనసంస్కృతి కళాసంస్థ ప్రధాన కార్యదర్శి, కళాకారుడు కలకట రెడ్డెప్ప బృందం మంగళవారం సెంట్రల్ బస్సుస్టేషన్, రుయాఆస్పత్రి, ఎమ్మార్‌పల్లె పోలీస్‌స్టేషన్ ప్రాంతాలలో జానపద గీతాలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వృద్ధుల సంక్షేమ చట్టం, సంరక్షణ, వృద్ధాశ్రమాల ఏర్పాట్లు, పర్యవేక్షణ, నియంత్రణ, వైద్య సదుపాయం, ప్రాణ, ఆస్తుల రక్షణ, సామాజిక భద్రతలో వృద్ధులకు ఎన్టీఆర్ భరోసా కల్పిస్తూ రూ.4వేలు పెన్షన్ మంజూరు, హెల్ప్‌లైన్ 14567 ఉన్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో కళాకారులు గంగులమ్మ, దొరస్వామి పాల్గొన్నారు.

జాతీయస్థాయి గణిత పరీక్షలో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



ఐఓక్యూఎంకు ఎంపికైన విద్యార్థులతో ఏజీఎం, ప్రిన్సిపాల్

తిరుపతి(విద్య), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిర్వహించే గణిత పరీక్షలో తిరుపతి బైరాగిపట్టెడలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్ ఐపీఎల్ బ్రాంచ్ 10వ తరగతి విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని ఆ విద్యాసంస్థల ఏజీఎం సురేష్, ప్రిన్సిపాల్ అన్నపూర్ణ తెలిపారు. ప్రతిష్టాత్మకంగా అంతర్జాతీయ స్థాయిలో జరిగే గణిత పరీక్షకు అర్హత పరీక్షగా కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఇండియన్ ఒలంపియాడ్ క్వాలిఫైయర్ ఇన్ మ్యాథమేటిక్స్ (ఐఓక్యూఎం) పరీక్షను ఏటా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల నిర్వహించిన లెవెల్-1 పరీక్షలో శ్రీచైతన్య ఐపీఎల్ బ్రాంచ్ విద్యార్థులు గల్లా వర్షశ్రీ, సాయి నిహారిక, కార్తీక్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి లెవెల్-2కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ఐపీఎల్ ఇన్‌చార్జి కృష్ణమూర్తి, కోఆర్డినేటర్ బాలాజీ, డీన్ చంద్రమోహన్, సి బ్యాచ్ ఇన్‌చార్జి మునిరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల ప్రారంభానికి ఆహ్వానం



రవి నాయుడిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తిరుపతి అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మంగళం ట్రెండ్స్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి బేస్ బాల్ అండర్-14 పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని ప్రధానోపాధ్యాయులు కేశవుల నాయుడు శాప్ చైర్మన్ రవి నాయుడిని ఆహ్వానించారు. మంగళవారం ఆయన్ను పాఠశాల ఉపాధ్యాయుల బృందం మర్యాదపూర్వకంగా కలసి ఘనంగా సన్మానించారు. క్రీడలకు శాప్ సహకారం అందిస్తామని రవి నాయుడు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణమ నాయుడు, జగన్నాథరావు, శ్రీధర్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ రైలు మార్గం నిర్మాణ పనులు వేగవంతం



తిరుపతి-రేణిగుంట రైలుమార్గంలో అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): చెన్నై-తిరుపతి బైపాస్ రైలు మార్గంలోని తిరుపతి ఇంజనీరింగ్ విభాగం పరిధిలోని రేణిగుంట సమీపంలో బ్రిడ్జి విస్తరణ పనులను మంగళవారం రైల్వే శాఖ అధికారులు పరిశీలించారు. పనుల్లో ఇతర శాఖలకు సంబంధించిన కేబుల్స్‌కు నష్టం జరుగకుండా తీసుకోవలసిన చర్యలను అధికారులు అధ్యయనం చేశారు. మరో రెండు నెలల్లో పనులు పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు.

రెండునెలల వరకు రాకపోకలకు ఇక్కట్లు

ఈ వంతెన విస్తరణ పనుల కారణంగా తూకివాకం, వెంకటరెడ్డి కండ్రిగ, పన్నీరుకాలువ, తండ్లం, తిరుచానూరు గ్రామాలతో పాటు పది కాలనీల ప్రజలు రెండు నెలల పాటు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కోవాల్సి ఉంది. రేణిగుంట పట్టణం నుంచి కాలనీలకు వెళ్లాలంటే ఈ వంతెనలో నుంచి వెళ్లాలి. నిర్మాణ పనులు చేపట్టడంతో రెండు కిలోమీటర్ల దూరంలోని పాతదారిలోకి వెళ్లి ప్రయాణించవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేణిగుంటలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సంతవద్ద వంక కొట్టుకుపోయింది. అక్కడ పంచాయతీ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేశారు. దీంతో ప్రజల రాకపోకల సమస్య తీరింది. ద్విచక్ర వాహనాలు, కార్లు, జీపులు, ట్రాక్టర్ల రాకపోలు రద్దయ్యాయి. అధికారులు స్పందించి సంత వద్ద కొట్టుకుపోయిన వంతెనకు వెంటనే మరమ్మతులు చేయాలని కాలనీల వాసులు కోరుతున్నారు.

నేటి నుంచి ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో క్రీడా పోటీలు



క్రీడా పోటీలకు సిద్ధమవుతున్న హాకీ మైదానం

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ అనుబంధ కళాశాలల ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఈ నెల 23, 24 తేదీల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎన్.వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం ప్రారంభమయ్యే పోటీలకు టీటీడీ జేఈవో ఎం.గౌతమి, డీఈవో వై.నాగరాజు నాయుడు, డీపీఈ శివశంకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. 20 కళాశాలల నుంచి 8 హాకీ జట్లు, 12 ఫుట్‌బాల్ జట్లు, 14 షటిల్ జట్లు పోటీల్లో పాల్గొంటాయన్నారు. క్రీడాకారులకు ఆర్ట్స్ కళాశాల హాస్టల్‌లో భోజనం, వసతి కల్పిస్తున్నట్లు పీడీ ముస్తాక్ అహ్మద్ తెలిపారు. నిర్వాహకులు మైదానాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

పరిశోధనలపై ముగిసిన శిక్షణ

తిరుపతి(వైద్యం), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాలలో ఐసీఎంఆర్ ఆధ్వర్యంలో పరిశోధనలకు సంబంధించి రెండు రోజులుగా జరుగుతున్న శిక్షణా శిబిరం మంగళవారంతో ముగిసింది. ఐసీఎంఆర్ వైద్యాధికారులు కిరీటి, హెలీనాలు పరిశోధనలు, వాటిని చేసే పద్ధతులు, వాటి వలన వచ్చే ఫలితాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి, వైద్య విభాగాధిపతులు మధుసూదన్, రేఖా పాల్గొన్నారు.



ఆటోలో వెళ్తూ అల్పాహారం తింటున్న యువతులు

కోల్‌కత్తా మెట్రోరైళ్లలో సాయంత్రం పూట మహిళా ఉద్యోగులు కూరగాయలు తరుక్కుంటూ కనిపిస్తారని చెప్పుకునేవాళ్లు. ఇప్పుడా దృశ్యం కోసం అక్కడి దాకా అవసరం లేదు. సెజ్ పరిశ్రమల్లో పనులకు వెళ్తున్న ఆడవాళ్లందరిదీ ఇదే పరిస్థితి. నిద్రలేచి నింపాదిగా పనులకు వెళ్లడానికి వీళ్లు మగమహారాజులు కాదు కదా పాపం! ఇంటెడు పనీ పూర్తిచేసుకుని టిఫిను డబ్బా చేతబట్టుకుని ప్యాసింజరు ఆటో ఎక్కేయాలి. టైంకి చేరుకోవాలి. ఆ నాలుగు మెతుకులూ తినే సమయం.. ఇదిగో ఇలా ప్రయాణంలోనే. ఇది జాతీయ రహదారిపై సూళ్లూరుపేట-తడ మధ్య రోజూ కనిపించే ఉదయపు దృశ్యం.

- తడ, ఆంధ్రజ్యోతి

రెడ్ లైటు.. రైట్ రైట్

రెడ్ లైటు పడింది. పోలీసు వాహనం మాత్రం ముందుకే ఉరికింది. పోలీసులే 'సిగ్నల్‌'ను పట్టించుకోకుంటే, మనదేముందిలే అనుకున్నారేమో. ఆ వెనకే ద్విచక్ర వాహనదారులూ రయ్‌మంటూ వెళ్లారు. పక్కనుంచి వాహనాలు వస్తున్నా వీరు రోడ్డు దాటారు. దీంతో పక్క మార్గంలోని వాహనాలు రోడ్డుపైనే నిలిచి.. మరింత ట్రాఫిక్ సమస్యకు దారి తీసింది. ఈ ఘటన మంగళవారం సాయంత్రం తిరుపతి నగరంలోని అన్నమయ్య సర్కిల్లో చోటు చేసుకుంది. ట్రాఫిక్ నిబంధనలను అమలు చేయాల్సిన పోలీసులే.. ఇలా ఉల్లంఘనకు పాల్పడటం ఏమిటని వాహనదారులు విస్తుపోయారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి





అలిపిరి నుంచి దాదాపు తొమ్మిది కిలోమీటర్ల దూరంలోని తిరుమల క్షేత్రానికి కాలినడకన చేరుకోవాలంటే 3,550 మెట్లు ఎక్కాల్సిందే. గోవింద నామస్మరణ చేసుకుంటూ, చెమటలు తుడుచుకుంటూ, కష్టాన్ని మర్చిపోయేలా స్వామి రూపాన్ని తలచుకుంటూ అడుగులేస్తున్న భక్తులకు ఏడో మైలురాయి వద్ద నిలువెత్తు ఆంజనేయస్వామి విగ్రహం తారసపడుతుంది. తిరుమల దగ్గరకు చేరుకుంటున్నామనే భావనా కలుగుతుంది. నడక మార్గంలో భద్రాంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు వెనుక ఆసక్తికర పరిణామమే ఉంది.

1979లో ఏమైందంటే..

1990 వరకు దట్టమైన అడవి మధ్యలోనే తిరుమల క్షేత్రం ఉండేది. అలిపిరి కాలినడక మార్గంలో 1970 వరకు రోజుకు 400 నుంచి 500 మంది భక్తులు రావడమే ఎక్కువ. 1979లో ఏడోమైలు రాయి వద్ద ఓ మహిళ హత్య అప్పట్లో కలకలం సృష్టించింది. హత్య వివరాలు స్పష్టం కానప్పటికీ కాలినడక భక్తులను ఈ ఘటన ఆందోళనకు గురిచేసింది. అప్పటి టీటీడీ ఈవో పీవీఆర్కే ప్రసాద్ ఘటనా ప్రాంతాన్ని పరిశీలించి నేరాలకు ఆస్కారముందని గ్రహించారు. దీంతో ఈ మార్గం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. స్వయంగా నడిచి లోటుపాట్లను గుర్తించారు. ఎగుడుదిగుడుగా ఉన్న రాళ్లను సరి చేయించారు. తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయించారు. లైటింగ్ పెంచుతూ అక్కడక్కడ దుకాణాలు ఏర్పాటు చేయించారు. గోవిందనామస్మరణను గుర్తుచేసేలా బోర్డులు పెట్టించారు. నడకభక్తులకు లగేజి భారం తగ్గించేలా చూశారు. లగేజీ ఉచిత సరఫరా, పైకప్పు ఏర్పాటు లాంటి అభివృద్ధి పనులకు నాటి ఘటన కారణమైంది. ఫలితంగా ఏడాది వ్యవధిలోనే కాలినడక భక్తుల సంఖ్య నాలుగైదువేలకు పెరిగింది. అయినప్పటికీ ఏడో మైలు రాయి హత్యోదంతం పీవీఆర్కే ప్రసాద్ మదిని తొలుస్తూనే ఉండేది.

చేదు స్మృతి చెరిగి... భక్తి భావన పెరిగి..

- భద్రాంజనేయ విగ్రహం ఏర్పాటు నేపథ్యం

పెద్దాపురం శిల్పి సాయంతో...

ఈ క్రమంలో ప్రసాద్ తన సతీమణి గోపికతో సొంతూరు కాకినాడ వెళుతున్న క్రమంలో పెద్దాపురంలో 12 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహాన్ని చూశారు. వెంటనే కారు ఆపించి భక్తివెలుగులు మూర్తీభవిస్తున్న ఇలాంటి విగ్రహాన్ని తిరుపతిలోనూ ఏర్పాటు చేయాలని సంకల్పించారు. పెద్దాపురం సమీపాన ఓ గ్రామంలో ఉన్న ఈ విగ్రహ శిల్పి తోగు లక్ష్మణస్వామితో మాట్లాడారు. తొలుత తిరుపతిలోని టీటీడీ అడ్మినిస్ట్రేషన్ భవనం(హుజూర్ ఆఫీస్) ముందు ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. తరువాత అలిపిరిలో గరుత్మంతుడి విగ్రహాన్ని కూడా అద్భుతంగా ఏర్పాటు చేయించారు. ఇన్ని చేస్తున్నా అలిపిరి ఏడోమైలు వద్ద హత్యఘటన, వేదన పీవీఆర్కే ప్రసాద్‌ను వీడలేదు. ఈ క్రమంలో ఆయనకు ఓ పరిష్కార ఆలోచన వచ్చింది. దాని ఫలితమే భద్రాంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు. అదే శిల్పి ఆధ్వర్యంలో 1980లో ఏడోమైలు వద్ద పది అడుగుల పీఠంతో సహా 40 అడుగుల ఎత్తుతో విగ్రహాన్ని నిర్మింపజేశారు. ఇప్పుడు అక్కడ అంజనీపుత్రుడి విగ్రహం చూడగానే భక్తులకు నిండైన భక్తి భావన స్ఫురిస్తుంది. విగ్రహ శిలాఫలకంపై 'శిల్పాచార్య తోగు లక్ష్మణస్వామి' అనే పేరు నేటికీ కనిపిస్తోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

భీష్మయ్య నాయుడికి కన్నీటి వీడ్కోలు

- శేషాపురంలో ముగిసిన అంత్యక్రియలు
- పలువురు రాజకీయ, సినీ ప్రముఖుల నివాళులు



భీష్మయ్యనాయుడుకి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం శేషాపురంలో మంగళవారం సాయంత్రం టీటీడీ విశ్రాంత హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బొబ్బా భీష్మయ్యనాయుడికి అంత్యక్రియలు నిర్వహించారు. అనారోగ్యంతో హైదరాబాదులో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం ఆయన మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన భౌతికకాయాన్ని మంగళవారం ఉదయాన్నే స్వగ్రామమైన శేషాపురానికి తీసుకొచ్చారు. ఆంధ్రజ్యోతి దినపత్రిక పబ్లిషర్ శేషగిరిరావు, భీష్మయ్యనాయుడు బావమరిది, హైదరాబాదులోని కిమ్స్‌లో సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ సీఎస్ నాయుడు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, శాప్ చైర్మన్ రవినాయుడు, మాజీ ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, టీడీపీ నేతలు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు రామనాథంనాయుడు, సుబ్రమణ్యంనాయుడు, రమేష్‌రెడ్డి, బడి సుధాయాదవ్, ఆర్సీ మునికృష్ణ, బీజేపీ నాయకులు సుబ్రమణ్యంయాదవ్, నరేష్‌కుమార్‌నాయుడు, వైసీపీ నేత ఎంఆర్సీ రెడ్డి, టీటీడీ విశ్రాంత జేఈవో శ్రీనివాసరాజు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీఈవో వాసుదేవనాయుడు, మాజీ డిప్యూటీ ఈవో చిన్నంగారి రమణ, మంచు కృష్ణ, నారాయణ విద్యాసంస్థల జీఎం కొండలరావు, సినీనటుడు రఘుబాబు తదితరులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన కుమారులు బొబ్బా చరణ్‌కుమార్, బొబ్బా కిరణ్‌కుమార్‌ను పరామర్శించారు. కళ్యాణి డ్యామ్ పోలీస్ ట్రైనింగ్ కళాశాల మెడికల్ ఆఫీసర్‌గా, నారావారిపల్లె సీహెచ్‌సీ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా, టీటీడీ హెల్త్ ఆఫీసరుగా భీష్మయ్య నాయుడు అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. సాయంత్రం గ్రామస్థులు, అభిమానులు, బంధువులు, రాజకీయ నాయకుల కన్నీటి వీడ్కోలు నడుమ అంత్యక్రియలు జరిగాయి.

ఫోనులో సీఎం చంద్రబాబు పరామర్శ

సీఎం నారా చంద్రబాబునాయుడు ఫోను చేసి భీష్మయ్య నాయుడు కుమారులు బొబ్బా చరణ్‌కుమార్, బొబ్బా కిరణ్‌కుమార్‌ను పరామర్శించారు. భీష్మయ్యనాయుడు మృతికి సంతాపం తెలియజేసారు. టీటీడీ మాజీ ఈవో ఎల్వీ సుబ్రమణ్యం కూడా ఫోన్ చేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు.





భీష్మయ్యనాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న గల్లా అరుణకుమారి, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి - భీష్మయ్యనాయుడు భౌతికకాయాన్ని అంత్యక్రియలకు తీసుకెళుతున్న దృశ్యం

తిరుపతి ఐఐటీకి నీటి సంరక్షణ అవార్డు



కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ నుంచి అవార్డు అందుకుంటున్న ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ

ఏర్పేడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నీటి సంరక్షణ వ్యవస్థలో 2023 నేషనల్ వాటర్ అవార్డులలో తిరుపతి ఐఐటీ ప్రత్యేక ప్రస్తావన అవార్డును అందుకుంది. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్‌పాటిల్ చేతుల మీదుగా మంగళవారం న్యూఢిల్లీలో 5వ జాతీయ జల పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి చేతుల మీదుగా ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ అవార్డు అందుకున్నారు. తమ క్యాంపస్‌లో ఆదర్శవంతమైన నీటి సంరక్షణ వ్యవస్థను అమలు చేయడంతో కేంద్ర ప్రభుత్వం గుర్తించి అవార్డు అందజేసిందని సత్యనారాయణ తెలిపారు.



హీరో పరిశ్రమను సందర్శించిన కమిటీ సభ్యులు

పరిశ్రమలను పరిశీలించిన భద్రతా కమిటీ

సత్యవేడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ మంగళవారం సత్యవేడు, శ్రీసిటీలో పలు పరిశ్రమలను తనిఖీ చేసింది. కమిటీ చైర్‌పర్సన్ వసుధమిశ్రా నేతృత్వంలో సుమారు 15 మంది సభ్యులు పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. మాదనపాళెంలోని హీరో మోటో కార్ప్, వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరులోని అపోలో టైర్స్‌తో పాటు శ్రీసిటీలోని పలు పరిశ్రమలను తనిఖీ చేసి వివరాలను సేకరించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హీరో పరిశ్రమలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కమిటీ పలు సూచనలు చేసింది. జిల్లా.. సత్యవేడు అగ్నిమాపక శాఖ అధికారులు రమణయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ పనులు వేగవంతం చేయండి



జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న జాతీయ రహదారులు, రైల్వేప్రాజెక్టు పనులకు సంబంధించి భూసేకరణ పనులను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఎన్‌హెచ్‌ఏఐ పీడీలు, జిల్లా రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్షించారు. కడప-రేణిగుంట, రేణిగుంట-నాయుడుపేట, తిరుపతి బైపాస్ (కాలూరు క్రాస్ నుంచి రేణిగుంట వరకు) ఆరు లేన్ల రహదారి పనులను వేగవంతం చేయాలన్నారు. రేణిగుంట నుంచి చెన్నై వరకు నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులూ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూసేకరణలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కృష్ణపట్నం పోర్టు సమీపంలో నాయుడుపేట-తూర్పు కనుపూరు ఆరులేన్ల రహదారి 35.కి.మీ. చిల్లకూరు క్రాస్ నుంచి తూర్పు కనుపూరు వరకు నాలుగు లేన్ల రహదారి, తూర్పు కనుపూరు నుంచి కృష్ణపట్నం సౌత్‌గేట్ ఆరు లేన్ల రహదారి 36.కి.మీ., తమ్మినపట్నం నుంచి నారికెళ్లపల్లెను కలుపుతూ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు 4 లేన్లు, పోర్టు రోడ్డు పొడగింపునకు 6లేన్ల రహదారి 16కిలోమీటర్ల పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలన్నారు. శ్రీకాళహస్తి-నడికుడి రైల్వేప్రాజెక్టు భూసేకరణ కూడా ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఐఐటీ, ఐసర్‌లో పెండింగ్ భూసేకరణ పూర్తిచేయాలన్నారు. విమానాశ్రయం వద్ద జాతీయ రహదారి పెండింగ్ పనులను వచ్చే నెల 10నాటికి పూర్తిచేస్తామని, రేణిగుంట-నాయుడుపేట రోడ్డును చివరి నాటికి పూర్తి చేస్తామని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు తెలిపారు. జేసీ శుభం భన్సల్, గుడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఆర్డీవోలు కిరణ్మయి, భానుప్రకాష్‌రెడ్డి, ఎన్‌హెచ్ఏఐ పీడీలు వెంకటేష్, ఎంకే చౌదరి, రవీంద్రరావు, జిల్లా సర్వేయర్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

- 362 గ్రాముల బంగారు నగలు స్వాధీనం
- రూ. 3.55 లక్షల నగదు సీజ్



పట్టుబడిన నగలు, నిందితుడిని మీడియాకు చూపి వివరాలు వెల్లడిస్తున్నక్రైం డీఎస్పీ రమణకుమార్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఇళ్ల తాళాలు పగులకొట్టి చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతరాష్ట్ర దొంగలను మంగళవారం తిరుపతి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. వీరి భార్యా పిల్లలను అదుపులోకి తీసుకున్నా సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ వివరాలను మంగళవారం తిరుపతి రూరల్ పోలీసు స్టేషనులో సీఐ చిన్నగోవిందుతో కలిసి క్రైం డీఎస్పీ రమణకుమార్ మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. చెన్నైకి చెందిన శెట్టి మణి, శెట్టి సూర్య అన్నదమ్ములు. కొన్నేళ్ల కిందట హైదరాబాదుకు వలస వెళ్లిన వీరు అక్కడి ఎల్‌బీనగర్ సమీపంలోని శ్రీనివాస కాలనీ, శివనగర్‌లో వేర్వేరుగా కాపురమున్నారు. సులభ సంపాదన.. జల్సాల కోసం వీరు పదేళ్ల కిందట దొంగతనాలకు అలవాటు పడ్డారు. భార్య, బిడ్డలతో కలిసి ముందుగా నిర్ణయించిన ప్రాంతాల్లో పగటి పూట రెక్కీ నిర్వహిస్తారు. భిక్షాటన చేస్తున్నట్లు వీధుల్లో తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లు, అపార్టుమెంట్లను గుర్తిస్తారు. రాత్రిళ్లు తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడతారు. కాగా, గత నెల 20వ తేదీన ఓటేరు, శ్రీనివాసపురంలోని సురేష్, వెంకట్రాజు, సురేష్ ఇళ్లల్లో భారీ చోరీ జరిగింది. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి, డీఎస్పీ ప్రసాద్ పర్యవేక్షణలో సీఐ చిన్నగోవిందు ఈ కేసు దర్యాప్తు చేపట్టారు. ఎస్‌ఐ షేక్ షావలి, క్రైం పార్టీ ఏఎస్‌ఐ రాఘవ, హెడ్ కానిస్టేబుళ్లు వాసుదేవరావు, రవిప్రకాష్, కానిస్టేబుళ్లు భోభనాద్రి, ప్రసాద్, ప్రభాకర్, ప్రసాద్, ఆరీఫ్, మునిని ప్రత్యేక బృందాలుగా నియమించారు.

చోరీ కేసులను ఛేదించింది ఇలా..

ఈ తరహా చోరీలు ఎక్కడెక్కడ జరిగాయి? వాటిల్లో నిందితులు ఎవరనే కోణంలో విచారించారు. దీంతో ప్రకాశం జిల్లా కందుకూరు, రావులపాలెం, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ తరహా దొంగతనాలు జరిగినట్లు గుర్తించారు. ఈ నిందితుల ఫొటోలు, మొబైల్ నెంబర్లు సేకరించారు. వీరి కదలికలపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో మంగళవారం తిరుపతి రూరల్ రామాంజుపల్లి చెక్‌పోస్టు వద్ద కాపు కాచి ఇద్దరు నిందితులతో పాటు వారి భార్యా, పిల్లలు మొత్తం ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.10.31 లక్షల విలువ చేసే 362 గ్రాముల బంగారు నగలు, రూ.3.55లక్షల నగదు, దొంగతనాలకు వినియోగిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. శెట్టి మణి, శెట్టి సూర్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ చెప్పారు. మిగిలిన కుటుంబ సభ్యులను తహసీల్దార్ ఎదుట హాజరపరచి.. సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ కేసు ఛేదించిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు అందచేస్తారని డీఎస్పీ చెప్పారు.

ఉమ్మడి జిల్లాలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయండి

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అదానీ స్మార్ట్ మీటర్లు అమర్చడానికి క్షేత్ర స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని సదరన్ డిస్కం చిత్తూరు ఎస్ఈ ఇస్మాయిల్ అహమ్మద్, ఈఈలు రవికుమార్, వాసవీలత, బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు డివిజన్ అధికారులతో వీరు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, అనుబంధ సంస్థల్లో స్మార్ట్ మీటర్లు అమర్చుతున్నారని వారు వెల్లడించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కూడా 200 యూనిట్లు దాటిన వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు అమర్చడానికి క్షేత్రస్థాయిలో ఏఈలు నియమ నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు. స్మార్ట్ మీటర్లు అమర్చడానికి ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతస్థాయి అధికారులతో చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. తిరుపతి టౌన్, రూరల్ డివిజన్ కేంద్రాల్లో ఈఈలు వి.చంద్రశేఖరరావు, ఎస్.వాసురెడ్డితో పాటు రెండు డివిజన్ల డీఈఈలు, ఏఈలు, ఏఏవోలు పాల్గొన్నారు.

ఆక్సిలెంట్ ఫార్మాకు హెల్త్ కెనడా అవార్డు

శ్రీసిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని ఆక్సిలెంట్ ఫార్మా పరిశ్రమకు హెల్త్ కెనడా కరెంట్ గుడ్ మానుఫ్యాక్చరింగ్ ప్రాక్టీసెస్ (సీజీఎంపీఎస్) సర్టిఫికెట్ దక్కింది. కంపెనీ నాన్ స్టెరైల్ సదుపాయం కోసం ఈ గుర్తింపు అందుకుంది. సెప్టెంబర్ 16-20 తేదీల్లో ఈ సంస్థ పరిశ్రమను సందర్శించి నాణ్యత తనిఖీలు నిర్వహించింది. ఈ సర్టిఫికెట్ రావడం సంతోషంగా ఉందని పరిశ్రమ చైర్మన్ జితేష్ దేవేంద్ర తెలిపారు. తమ పరిశ్రమలో నాన్-స్టెరైల్ సదుపాయంలోని ఓరల్ సాలిడ్, ఓరల్ లిక్విడ్, సెమి సాలిడ్ ఉత్పత్తులకు సంబంధించి ఈ తనిఖీలు జరిగినట్లు ఆయన వివరించారు. కాగా, హెల్త్ కెనడా సీజీఎంపీఎస్ అనేది ఫార్మాస్యూటికల్, బయోటెక్నాలజీ, ఆహార ఉత్పత్తులకు సంబంధించి భద్రత, నాణ్యత మార్గదర్శకాలను రూపొందించే సంస్థ.



గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

పంచాయతీలు స్థానికంగా నిధులు సమకూర్చుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో

డక్కిలి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో స్థానికంగా నిధులు సమకూర్చుకోవాలని గూడూరు డివిజన్ పంచాయతీ అధికారి వెంకటరమణ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో శానిటేషన్, క్లోరినేషన్, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చి వర్మీకంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయించడం ద్వారా నిధులను స్థానికంగానే సమకూర్చుకొనేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. చేపల పెంపకానికి వేలం పాటలు సకాలంలో నిర్వహించి పంచాయితీల ఆదాయ మార్గాలను పెంచాలన్నారు. ఇంటి పన్నులు, లైసెన్సు ఫీజుల వసూళ్లలో నిర్లక్ష్యంతో వహిస్తే చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అంటు రోగాల బారిన పసడకుండా పారిశుధ్య పనులు మెరుగు పరచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ అల్లాభక్షు, రీసోర్స్ పర్సన్ రవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం


విజయభాస్కర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

నాయుడుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధితో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం అందించే సామర్థ్యం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే ఉందని టీడీపీ సీనియర్ నేత, ఏఎంసీ మాజీ ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన జన్మదినం సందర్భంగా పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నాయకులు, అభిమానుల నడుమ భారీ కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ రఫీ, టీడీపీ నాయకులు కట్ట రమణారెడ్డి, సన్నారెడ్డి చంద్రారెడ్డి, షైలారి రాజశేఖర్, గాలి రాజేష్ నాయుడు, జీవీఆర్ నాయుడు, ఉగ్గుమూడి భాస్కర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, సుధీర్, కరీముల్లా, గంగాప్రసాద్, శేషం మునిగోపి, అన్నమనేని సాయినాయుడు, నానాబాల సుబ్బారావు, చిందేటి సుజాత, సుబ్బారెడ్డి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

రేణిగుంట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. గాజుల మండ్యం పోలీసులు తెలిపిన వివరాలు... బిస్మిల్లానగర్‌కు చెందిన కాసీంబీ(52) ఆదివారం రాత్రి బాలాజీనగర్‌లోని తన కూతురు ఇంటికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ఎల్లమ్మ గుడి వద్ద రోడ్డు దాటుతుండగా ఓ యువకుడు అతివేగంగా ఆమెను ఢీకొనడంతో తీవ్రగాయాల పాలైంది. ఆమెను రుయాకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున మృతిచెందింది. ప్రమాదానికి కారణమైన యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాస్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం

రేణిగుంట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాస్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. మండలంలోని వెంకటాపురంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరానికి గ్రామస్తులు ఆవులను, ఎనుములను, దూడలను తోలుకుని వచ్చి పరీక్షలు నిర్వహించుకున్నారు.

విత్తనాల పంపిణీ

పిచ్చాటూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో మండలంలోని ప్రతి సచివాలయ పరిధిలో రైతు భరోసా కేంద్రాల్లో వీబీఎన్ 8 రకం మినుములు రాయితీపై పంపిణీ చేస్తున్నట్లు ఏవో సంజీవరెడ్డి తెలిపారు. కిలో రూ.98 అందిస్తున్నట్టు తెలిపారు. విత్తనాలు కావలసిన రైతులు ఆధార్ కార్డు, భూమి పాస్‌బుక్‌లతో ఆర్‌బీకేల్లో బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుంది. మినుములు చల్లిన తరువాత ఈ-క్రాప్ నమోదు చేసుకుంటే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, సున్నా వడ్డీ, పంట నష్టపరిహారం రావడానికి వీలుంటుందన్నారు.

విద్యార్థులతో మాక్ పోలింగ్



శ్రీకాళహస్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఎన్నికల నిర్వహణ జరిపే విధానాన్ని మంగళవారం 5వ తరగతి విద్యార్థులతో మాక్‌పోలింగ్ నిర్వహించారు. ఓటరు పేరు పరిశీలించడం, ఓటు వేసే సమయంలో ఓటర్లకు సూచనలివ్వడం, ఓటు వేసిన వారికి ఇంకు పూయడం వంటివి విద్యార్థులతో చేయించారు. ప్రిన్సిపాల్ ప్రభావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి ఎమ్మెల్యే అభినందన


క్రీడాకారిణి షేక్ సనా ఫిర్దోస్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, అక్టోబరు 22: పట్టణంలోని ఎంజీఎం పాఠశాల విద్యార్థి షేక్ సనా ఫిర్దోస్ అండర్-14 విభాగం బ్యాడ్మింటన్ పోటీల్లో మొదటిస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి... షేక్ సనాను సన్మానించారు. ఈనెల 28న మల్కీపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభకనబరిచి శ్రీకాళహస్తికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు.

జాబ్ మేళాలో 278 మందికి ఉద్యోగాలు

సూళ్లూరుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఏపీ స్కిల్ డెవల్మమెంట్ కార్పొరేషన్, డీఆర్‌డీఏ సంయుక్తంగా నిర్వహించిన జాబ్‌మేళాను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ జ్యోతి ప్రారంభించారు. శ్రీసిటీ, మాంబట్టు, మేనకూరు పారిశ్రామిక వాడల్లోని 25 పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 642 మంది హాజరు కాగా, 278మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం తెలిపారు.

న్యాయవాదుల నిరసన

సూళ్లూరుపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సీనియర్ న్యాయవాది ధర్మాప్రసాద్‌పై ఎస్‌ఐ బ్రహ్మ నాయుడు దురుసుగా ప్రవర్తించడాన్ని ఖండిస్తూ న్యాయవాదులు విధులు కోర్టు ఎదుట నిరసన తెలి పారు. ఈనెల 18న ఓ కేసు విషయమై మాట్లాడు తుండగా న్యాయవాది ధర్మాప్రసాద్‌తో ఎస్‌ఐ దురుసుగా ప్రవర్తించడమే కాకుండా బలవతంగా కాని స్టేబుళ్ల చేత బయటకు పంపించడం సమంజసం కాదన్నారు. ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు జలంధర్ రెడ్డి, గణపతి, శ్రీరాముల యాదవ్, పీఎస్‌ఆర్‌వీ ప్రసాద్, విజయమ్మ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

తడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో విజయ్‌కుమార్ చెప్పారు. మంగళవారం తడ సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తడ, కారూరు, రామాపురం సచివాలయాల్లో నాలుగు రోజులపాటు ఆధార్ కేంద్రం అందుబాటులో ఉంటుందని ఎంపీడీవో తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న బస్సు యువకుడికి గాయాలు

సూళ్లూరుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొణ్ణబంట్టు వద్ద ఆర్టీసీ బస్సు, మోటారు సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. మంగళవారం సూళ్లూరుపేట నుంచి మంగా నెల్లూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో సూళ్లూరుపేట పాలవల్లీవారి వీధికి చెందిన సోనూకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటగిరిలో నేడు అన్న క్యాంటీన్ ప్రారంభం

వెంకటగిరి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో ఎంపీడీవో కార్యాలయం వద్ద అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, కలెక్టర్ వెంకటేశ్ బుధవారం ప్రారంభిస్తారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశారు.

దళిత మహిళపై వైసీపీ కార్యకర్త దాడి
అట్రాసిటీ కేసు నమోదు

పెళ్లకూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరులో దళిత మహిళపై వైసీపీ కార్యకర్త దాడి చేసిన ఘటనపై మంగళవారం పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో చిల్లకూరు దళితవాడకు చెందిన గీత రోడ్డుపై నడిచి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త నాగార్జున ఆమెపై దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

కామిరెడ్డి ఇంటిపై దాడి కేసు దర్యాప్తు

పెళ్లకూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరులో ఎస్డీసీసీబీ మాజీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఇంటిపై దాడికి యత్నం, ఇంటి గేటుకు తాళాలు వేసిన ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మంగళవారం నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు చిల్లకూరుకు చేరుకుని సత్యనారాయణరెడ్డి నివాసంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. ఇద్దరు వ్యక్తులు ఇంటి గేటుకు తాళాలు వేస్తున్నట్లు గుర్తించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న సీఐ ఇరువర్గాలపై నమోదు చేసిన కేసుల వివరాలను పరిశీలించారు.

దుకాణాల్లో తనిఖీలు

కోట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్, కోట పట్టణంలోని పలు దుకాణాల్లో తూనికలు, కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్ భరత్‌కుమార్ తనిఖీలు చేశారు.

ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు!

- మూడో వంతు వీఆర్వో పోస్టులు ఖాళీలు
- ప్రజలకు సకాలంలో అందని రెవెన్యూ సేవలు


తహసీల్దారు కార్యాలయం

గూడూరు(అర్బన్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజాజీవన వ్యవస్థలో కీలకమైన రెవెన్యూశాఖలో నెలల తరబడి వీఆర్వోల ఖాళీలు భర్తీ కాకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. ధృవీకరణ పత్రాలు మొదలు భూముల వివరాల నమోదు వరకు ప్రజలకు అవసరమయ్యే వివిధ కార్యకలాపాల్లో గ్రామ రెవెన్యూ అధికారులు కీలకం కాగా, చాలా స్థానాల్లో ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. సాధారణ స్థానంతో పాటు రెవెన్యూ కార్యదర్శులకు పనిఒత్తిడి పెరగడంతో పాటు ప్రజలకు సకాలంలో అందుబాటులో ఉండి వారి అవసరాలు తీర్చలేకున్నారు. మండలంలో మొత్తం 39 కార్యదర్శులు ఉండాల్సి ఉండగా, నాలుగవ వంతుకు పైగా లేరు. గ్రామీణంలో 18మందికి బదులు 13మంది ఉన్నారు. ఐదుగురు వీఆర్వోల లోటు ఉంది. అలాగే పట్టణంలో 21 వార్డు సచివాలయాలకు ఆరుగురు లేరు. 15మంది మాత్రమే నెట్టుకొస్తున్నారు. గ్రామంలో ఖాళీగా ఉన్న విందూరుకు కొమ్మనేటూరు వీఆర్వో, పాలిచర్లకు పోటుపాళెం వీఆర్వో, కొండాగుంటకు దివిపాలెం 1 వీఆర్వో, నెల్లటూరుకు చెన్నూరు బిట్ 2 వీఆర్వో, మేకనూరుకు అయ్యవారిపాళెం వీఆర్వో ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే పట్టణంలో సాధుపేట, ఇందిరానగర్, మాళవ్యానగర్‌లోని రెండు వార్డులకు ఒక్కొక్క సచివాలయ రెవెన్యూ కార్యదర్శి విధులు నిర్వహిస్తున్నారు. సత్రపువీధి సచివాలయానికి మెప్మా బిల్డింగ్, అశోక్‌నగర్‌కు సీవీసీ పార్కు సచివాలయ రెవెన్యూ కార్యదర్శి ఇన్‌చార్జిలుగా విధులు నిర్వహిస్తున్నారు. కీలకమైన వీఆర్వోల కొరత ఎక్కువగా ఉండటంతో ఇబ్బందులు కూడా ఎక్కువగానే ఉంటున్నాయని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు చొరవ చూపి పూర్తి స్థాయిలో వీఆర్వోల నియామకాలు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా

గూడూరు మండలంలో 11మంది వీఆర్వోల కొరత ఉంది. ఇన్‌చార్జిలతో సర్దుబాటు చేశాం. ప్రజల ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా. వచ్చే సాధారణ బదిలీల్లో ఖాళీలు భర్తీ అవుతాయని ఆశిస్తున్నా.

– కె.చంద్రశేఖర్, తహసీల్దారు

ఎమ్మెల్యే విజయశ్రీకి టీడీపీ నేతల జన్మదిన శుభాకాంక్షలు


విజయశ్రీని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

నాయుడుపేట/పెళ్లకూరు/సూళ్లూరుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త, టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్, వెంకటగిరి, గూడూరు ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పాశిం సునీల్ కుమార్, పెంచలకోన ఆలయ మాజీ ఛైర్మన్ తానంకి నానాజీ ఎమ్మెల్యే ఇంటికి చేరుకొని కేక్‌కట్ చేసి అభినందనలు తెలిపారు. వారితో పాటు నెలవల రాజేష్, ఎన్.పార్థసారధి, ఏ.రమేష్, ఏజీ కిషోర్ ఉన్నారు. ● నాయుడుపేట ఏఎంసీ మాజీ ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ నేత కట్ట రమణారెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ రఫీ, ఆర్యవైశ్యసంఘ జిల్లా అధ్యక్షుడు గూడూరు కిషోర్, సన్నారెడ్డి చంద్రారెడ్డి, షైలారి రాజశేఖర్, గాలి రాజేష్ నాయుడు, జీవీఆర్ నాయుడు, ఉగ్గుమూడి భాస్కర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, సుధీర్, కరీముల్లా, గంగాప్రసాద్, మునిగోపి, సాయి నాయుడు తదితరులు ఎమ్మెల్యే విజయశ్రీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ● ఎమ్మెల్యే విజయశ్రీకి పెళ్లకూరు మండల టీడీపీ అధ్యక్షుడు సంచి కృష్ణయ్య జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దామెర ప్రసాద్ నాయుడు, శేఖర్ నాయుడు, రాజారెడ్డి, సిద్దు లయ్య నాయుడు, నరేంద్ర యాదవ్, వెంపళ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అలాగే పేరం రమేష్‌నాయుడు, కందమూడి శివకుమార్, కాటూరు గోపాల్‌రెడ్డి ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలిపారు.

సిమెంటు రోడ్లకు శంకుస్థాపన

చిట్టమూరు/ కోట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలంలోని యల్లసిరిలో రూ.5లక్షలు, యాకసిరిలో రూ.5 లక్షలు, కోగిలి పంచాయతీలోని వడ్డికండ్రిగలో రూ.5లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు ప్రసాద్, ఎంపీడీవో మనోహర్‌గౌడ్, టీడీపీ నాయకులు కామిరెడ్డి సునీల్‌రెడ్డి, మారంరెడ్డి జనార్ధన్‌రెడ్డి, బసిరెడ్డి హరికృష్ణారెడ్డి, నల్లారెడ్డి రాజేష్‌రెడ్డి, కాపులూరు చెంచురామయ్య ఆచారి, చిన్నారావు, అనురాధ, గుండుబోయిన కస్తూరయ్య, రషీద్, మోహన్‌రెడ్డి, అంకయ్య, జి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ● కోట మండల పరిధిలోని గూడలి పంచా యతీ చంద్రశేఖరపురం మసీదు వీధిలో రూ.4.8 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి టీడీపీ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు షేక్ మస్తాన్‌బాషా భూమిపూజ చేశారు. టీడీపీ నాయకులు మణియాదవ్, వెంకటరమణయ్య, శ్రీనివాసులు, సత్తార్ పాల్గొన్నారు.

అధిక మోతాదులో ఎరువుల వాడకం అనర్థం

ఓజిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు తప్పనిసరిగా యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి అన్నారు. ఓజిలి మండలం నెమళ్లపూడి, మనవాలి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్ర సందర్శన చేశారు. పంటల సాగులో మెలకువలు, ఎరువులు, పురుగు మందుల వాడకం వంటి విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు.

విద్యార్థుల సామర్థ్యం పరిశీలన

కోట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు పంచాయతీలో గల మైక్రో టవర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాన్ని ఎంఈవో మస్తానయ్య మంగళవారం పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు.

ఎన్‌బీకేఆర్ అధ్యాపకుడికి డాక్టరేట్

కోట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కందాటి దశరథరామిరెడ్డికి డాక్టరేట్ లభించింది. డాక్టర్ ఎం.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో అనాలసిస్ ఆఫ్ ఫెరేటెడ్ లెర్నింగ్ అనే అంశంపై దశరథరామిరెడ్డి పరిశోధనలు చేసి వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి పంపగా డాక్టరేట్ ప్రదానం చేశారు. మంగళవారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు షీల్డ్‌లు, మెమోంటోలతో దశరథ రామిరెడ్డిని అభినందించారు.

మేలైన పంట ఉత్పత్తుల సాధించేందుకు కృషి

వాకాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో రైతాంగం మేలైన పంట ఉత్పత్తులు సాధించేందుకు కృషి చేస్తామని వ్యవసాయ శాఖ అధికారిణి దీప అన్నారు. మంగళవారం మండలంలోని దుగరాజపట్నంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. నారుమడి, ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. రైతులు తమ పంట ఉత్పత్తుల్లో మేలైన దిగుబడి వచ్చేలా శాస్త్రవేత్తల సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దోశకాయల కృష్ణమూర్తి, వెటర్నరీ అసిస్టెంట్ శ్రీలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిరదవాడ జాతీయ రహదారి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మేనకూరు సెజ్‌లోని ఓ ప్రైవేట్ కర్మాగారంలో పనిచేస్తున్న హరిశర్మ బిరదవాడ జాతీయ రహదారి సమీపంలో నడిచి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హరిశర్మను నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైపాస్ రైలు మార్గం నిర్మాణ పనులు వేగవంతం


తిరుపతి - రేణిగుంట రైలుమార్గంలో అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): చెన్నై-తిరుపతి బైపాస్ రైలు మార్గంలోని తిరుపతి ఇంజనీరింగ్ విభాగం పరిధిలోని రేణిగుంట సమీపంలో జరుగుతున్న బ్రిడ్జి విస్తరణ పనులను మంగళవారం రైల్వే శాఖ అధికారులు పరిశీలించారు. ఈ పనుల్లో ఇతర శాఖలకు సంబంధించిన కేబుల్స్‌కు నష్టం జరుగకుండా తీసుకోవలసిన చర్యలను అధికారులు అధ్యయనం చేశారు. మరో రెండు నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు.

రెండునెలల వరకు ప్రజల రాకపోకలకు ఇక్కట్లు

ఈ వంతెన విస్తరణ పనులను చేపట్టిన కారణంగా తూకివాకం, వెంకటరెడ్డి కండ్రిగ, పన్నీరుకాలువ, తండ్లం, తిరుచానూరు గ్రామాలతో పాటు పది కాలనీల ప్రజలు రెండు నెలల పాటు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కోవాల్సి ఉంది. రేణిగుంట పట్టణం నుంచి కాలనీలకు వెళ్లాలంటే ఈ వంతెనలో నుంచి వెళ్లాలి. నిర్మాణ పనులు చేపట్టడంతో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాతదారిలోకి వెళ్లి ప్రయాణించవలసి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేణిగుంటలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సంతవద్ద వంక కొట్టుకుపోయింది. అక్కడ పంచాయతీ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేశారు. దీంతో ప్రజల రాకపోకల సమస్య తీరింది. ద్విచక్ర వాహనాలు, కార్లు, జీపులు, ట్రాక్టర్ల రాకపోలు రద్దయ్యాయి. అధికారులు స్పందించి సంత వద్ద కొట్టుకుపోయిన వంతెనకు వెంటనే మరమ్మతులు చేయాలని కాలనీల వాసులు కోరుతున్నారు.

నేటి నుంచి ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో క్రీడా పోటీలు


క్రీడా పోటీలకు సిద్ధమవుతున్న హాకీ మైదానం

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ అనుబంధ కళాశాలల ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఈ నెల 23, 24 తేదీల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎన్.వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే పోటీలకు టీటీడీ జేఈవో ఎం.గౌతమి, డీఈవో వై.నాగరాజు నాయుడు, డీపీఈ శివశంకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. 20 కళాశాలల నుంచి 8 హాకీ జట్లు, 12 ఫుట్‌బాల్ జట్లు, 14 షటిల్ జట్లు పోటీల్లో పాల్గొంటాయన్నారు. క్రీడాకారులకు ఆర్ట్స్ కళాశాల హాస్టల్‌లో భోజనం, వసతి కల్పిస్తున్నట్లు పీడీ ముస్తాక్ అహ్మద్ తెలిపారు. నిర్వాహకులు మైదానాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

పరిశోధనలపై ముగిసిన శిక్షణ

తిరుపతి(వైద్యం), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాలలో ఐసీఎంఆర్ ఆధ్వర్యంలో పరిశోధనలకు సంబంధించి గత రెండు రోజులుగా జరుగుతున్న శిక్షణా శిబిరం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఐసీఎంఆర్ వైద్యాధికారులు కిరీటి, హెలీనాలు పరిశోధనలు, వాటిని చేసే పద్ధతులు, వాటి వలన వచ్చే ఫలితాలపై వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పలు ప్రయోగాత్మకంగా పరిశోధనలు చేసి చూపించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ మూర్తి, వైద్య విభాగాధిపతులు మధుసూదన్, రేఖా పాల్గొన్నారు.

షాట్‌పుట్‌లో బంగారు పతకం



తిరుపతి అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గత వారం గుంటూరులో జరిగిన 35వ సౌత్‌జోన్ జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్‌మీట్‌లో తిరుపతికి చెందిన క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. అండర్ 16 బాలుర విభాగంలో షాట్‌పుట్‌లో బి.ప్రణీత్‌కుమార్ ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించాడు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గిరిధర్‌రాజు, రాబర్ట్, కోచ్ ప్రసాద్‌లు మంగళవారం ప్రణీత్‌కుమార్‌ను అభినందించి, మరిన్ని పతకాలు కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు.

చిన్నపిల్లల ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయండి
టీటీడీ జేఈవో గౌతమి


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న టీటీడీ జేఈవో గౌతమి

తిరుపతి(వైద్యం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లల ఆస్పత్రి నిర్మాణ పనుల్లో వేగవంతం పెంచి, మరో ఐదు నెలల్లో (మార్చి నాటికి) చిన్నారులకు వైద్యసేవలు అందించేందుకు అందుబాటులోకి తీసుకురావాలని టీటీడీ జేఈవో గౌతమి అధికారులను ఆదేశించారు. అలిపిరి జూపార్కు రోడ్డులో టీటీడీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీపద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ అవసరం మేరకు అధనంగా కార్మికులను ఏర్పాటు చేసి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో మెరుగైన గుండె వైద్య సేవలు అందిస్తూ ఎంతో మంది చిన్నారుల ప్రాణాలను నిలబెడుతున్నారన్నారు. నూతనంగా నిర్మించే ఈ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలతో చిన్నారులకు అన్ని రకాల జబ్బులకు వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు టీటీడీ కృషి చేస్తుందని ఆమె తెలిపారు. దీనికి ముందు ఆమె ఆస్పత్రి నిర్మాణ పనులపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రిలో జరుగుతున్న సివిల్, ఎలక్ట్రికల్ పనులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, సీఈ సత్యనారాయణ, శ్రీపద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, ఈఈలు కృష్ణారెడ్డి, మల్లికార్జున ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణను అడ్డుకున్నందుకు వీఆర్‌ఏ దాడి

వరదయ్యపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థులందరూ దైవకార్యాలకు వినియోగించుకుంటున్న కచేరి స్థల ఆక్రమణను అడ్డుకున్నందుకు వీఆర్‌ఏ, అతడి కుమారుడు దాడి చేయడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండలంలోని పాండూరులో కచేరి స్థలాన్ని అదే గ్రామానికిచెందిన వీఆర్‌ఏ చెంచయ్య గతంలో ఆక్రమించగా గ్రామస్థులు తహసీల్దారుకు ఫిర్యాదుచేయడంతో రెవెన్యూ అధికారులుసర్వేచేసి ప్రభుత్వ స్థలంగా గుర్తించారు. ఇదిలా ఉండగా సోమవారం వీఆర్‌ఏ చెంచయ్య, అతడి కుమారుడు చెంచుబాబు కచేరిస్థలానికి వేసిన సర్వే హద్దురాళ్లను తొలగించి ఆక్రమించేందుకు యత్నించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు వారిని అడ్డుకున్నారు. హద్దురాళ్లను యథాక్రమంలో నాటి ఆ స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. ఆక్రమణను అడ్డుకోవడంలో ప్రధాన కారణమైన చిటెట్టి చెంగల్రాయులు సాయంత్రం ఇంటికి వెళుతున్నారు. ఆ సమయంలో చెంచయ్య, అతడి కుమారుడు చెంచుబాబు, మద్దతుదారులైన సురేష్, సుధాకర్ కర్రలతో దాడి చేశారు. చెంగల్రాయులుపై దాడిని అడ్డుకోవడానికి వచ్చిన చిట్టతూరు బత్తెయ్యనూ కొట్టడంతో ఇరువురు గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వివేక్ ఎక్స్‌ప్రెస్‌కు రేణిగుంటలో 10 నిమిషాల హాల్ట్

వేళచ్చేరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైలు బోగీల్లో నీరు నింపేందుకు వివేక్ ఎక్స్‌ప్రెస్ 10 నిమిషాలు రేణిగుంట రైల్వేస్టేషన్‌లో ఆగనుంది. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో.. నెం.22504 డిబ్రూగర్-కన్నియాకుమారి వివేక్ ఎక్స్‌ప్రెస్ రేణిగుంటకు వేకువజామున 3 గంటలకు చేరుకొని 3.10 నిమిషాలకు బయల్దేరుతుంది. అలాగే, నెం.22503 కన్నియాకుమారి-డిబ్రూగర్ వివేక్ ఎక్స్‌ప్రెస్ రేణిగుంటకు మధ్యాహ్నం 12.10 గంటలకు చేరుకొని 12.20 గంటలకు బయల్దేరి వెళుతుంది. ఈ సమయాల మార్పు బుధవారం నుంచి అమలుకు రానున్నాయి.

భక్తుల కోసమే మరుగుదొడ్లు

శ్రీకాళహస్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్లను ప్రారంభించినట్లు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చెప్పారు. శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని రాఘవేంద్రస్వామి మఠం పక్కన రూ.36లక్షలతో నిర్మించిన మరుగుదొడ్లు, టూరిస్టు బస్టాండు వద్ద రూ.18లక్షలతో నిర్మించిన మరుగుదొడ్లను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు చెంచయ్యనాయుడు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మరుగుదొడ్లను ప్రాంరభిస్తున్న ఎమ్మెల్యే

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు: స్కూటరిస్టుకు గాయాలు

ఏర్పేడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కారును నడుపుకుంటూ వస్తూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడో డ్రైవర్. ఆ ప్రమాదంలో స్కూటరిస్టు తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని మునగలపాళెం పంచాయతీ మూల కండ్రిగలో ఓసూరమ్మ ఆలయానికి ప్రత్యేకత ఉంది. ఈ ఆలయంలో ప్రతి మంగళవారం మద్యం మానాలను కునేవారికి అమ్మవారి ఎదుట చేతికి దారం కడుతారు. అప్పటి నుంచి మద్యం తాగరని నమ్మకం. ఈక్రమంలో మంగళవారం ఈ ఆలయానికి తిరుపతికి చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి కారు నడుపుకుంటూ వస్తూ ద్విచక్ర వాహనంపై వస్తున్న సదాశివపురానికి చెందిన మునిరామిరెడ్డిని ఢీకొన్నాడు. ఈ ఘటనలో మునిరామిరెడ్డి చెంప చెక్కుకు పోయింది. మునిరామిరెడ్డి డిక్సన్ కంపెనీలో విధులకు హాజరయ్యే క్రమంలో ప్రమాదం బారిన పడ్డారు. అటుగా వెళ్తున్న గ్రామస్తులు ఆయన్ను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఏర్పేడు పోలీసులు కేసు నమోదు చేశారు.


ప్రమాదంలో తీవ్రగా గాయపడిన మునిరామిరెడ్డి

ముక్కంటి సేవలో బీజేపీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి



శ్రీకాళహస్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత ముక్కంటీశుడిని మంగళవారం భారతీయ జనతా పార్టీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి మహేష్‌పాండే కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనాంతరం మృ త్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపం డితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని యువతికి గాయాలు

రేణిగుంట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొని యువతి గాయపడింది. రేణిగుంటకు చెందిన జెనీఫర్ ఆటోలో తిరుపతికి వెళుతుండగా వెనుక వస్తున్న లగేజీ వాహనం ఆటోను ఢీకొంది. అందులో ప్రయాణిస్తున్న జెనీఫర్ గాయాల పాలైంది. చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గాజులమండ్యం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పుత్తూరు వార్తలు

భూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

● పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ మాధవయ్య

పుత్తూరు అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య అధికారులను కోరారు. మంగళవారం గొల్లపల్లి సచివాలయంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వం రీసర్వే చేయనప్పటికీ చేసినట్లుగా రికార్డుల్లో మార్పులు చేసిందన్నారు. ప్రస్తుత గ్రామసభల ద్వారా రైతుల నుంచి స్వీకరించే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ చిట్టిబాబు, ఐవోఎస్ కృపాకర్, మాజీ ఎంపీటీసీ కోట గజపతి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న మాధవయ్య

దీపావళి టపాకాయల దుకాణాలకు ఆటుపోట్లు

పుత్తూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : దీపావళి టపాకాయల విక్రయ దుకాణాలు ఈ ఏడాది కూడా పట్టణానికి దూరంగా వున్న ప్రభుత్వ డిగ్రీకళాశాల మైదానం వేదిక కానుంది. గతంలో పట్టణం నడిబొడ్డున వున్న ధర్మరాజుల ఆలయ మైదానంలో దుకాణాలు ఏర్పాటు చేసేవారు. భద్రతా కారణాల రీత్యా నాలుగేళ్ల నుంచి డిగ్రీ కళాశాల మైదానానికి మర్చారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఎనిమిది దుకాణాలకు ఐదు రోజులకు కలెక్టర్ అనుమతులు ఇచ్చారు. ప్రతి దుకాణాదారుడు ఐదు రకాల పన్నులను ఆయా శాఖల ద్వారా ప్రభుత్వానికి చెల్లించాలి. తొలుత ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నేల అద్దె కింద రూ.వెయ్యిని కాలేజ్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ పద్దు కింద బ్యాంకులో చెల్లించి రశీదును కళాశాలలో అందించాలి. ఇక మున్సిపల్ కార్యాలయానికి రెండు పద్దుల కింద రూ.2 వేలు, ఆర్డీవో, అగ్నిమాపక శాఖలకు తలా ఐదు వందలు, చివరగా అమ్మకం పన్ను కింద టోకుగా రూ.25 వేలను చెల్లించాల్సి వుంది. విక్రయాలకు ఐదు రోజుల అనుమతి మాత్రమే ఉండడంతో పండుగకు మూడు రోజుల ముందు నుంచి దుకాణాలను ప్రారంభిస్తారు. వర్షం పడితే దుకాణాదారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తుంది. చివరగా అగ్నిప్రమాదం భయం వెంటాడుతుంది. ఈ ఆటుపోట్లను దాటు కుంటేనే దుకాణాదారుడి కళ్లలో లాభాల వెలుగులు విరజిమ్ముతాయి.

రాజేశ్వరమ్మకు మాజీ మంత్రి ఘన నివాళి


రాజేశ్వరమ్మకు నివాళి అర్పిస్తున్న గల్లా అరుణకుమారి

వడమాలపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఇటీవల మృతి చెందిన ఎస్‌బీఆర్ పురానికి చెందిన సుబ్బుల రాజు భార్య రాజేశ్వరమ్మకు మాజీ మంత్రి గల్లా అరుణకుమారి ఘనంగా నివాళులర్పించారు. రాజేశ్వరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తిరుపతి ఎస్వీ యూనివర్శిటీలో తన భర్త గల్లా రామచంద్రనాయుడితో కలిసి చదువుకున్న రాజేశ్వరమ్మ కుటుంబంతో పరిచయం ఉందని అరుణకుమారి చెప్పారు. నివాళులర్పించిన వారిలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు, టీడీపీ నాయకులు పెద్దబ్బ రాజు, సుకుమార్, రవి తదితరులు ఉన్నారు.

శ్రీకృష్ణ దేవరాయలు జిల్లాగా పేరు పెట్టండి


నిరసన వ్యక్తం చేస్తున్న జై భీమ్ సేన నాయకులు

పుత్తూరు అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఏదేని జిల్లాకు ఆంధ్ర భోజుడిగా కీర్తింపబడిన శ్రీకృష్ణదేవరాయలు జిల్లాగా మార్పు చేయాలని జై భీమ్ సేన డిమాండ్ చేసింది. మంగళవారం స్థానికంగా జై భీమ్ జెండాలు చేతబట్టి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ జిల్లా, ప్రకాశం జిల్లా, అన్నమయ్య జిల్లాలు ఉన్నప్పుడు రాయలసీమను రతనాల సీమగా చేసిన మహనీయుడను స్మరించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. తప్పనిసరిగా శ్రీకృష్ణదేవరాయలు పేరుతో జిల్లాకు నామకరణం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

పుత్తూరు టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో రక్తహీనత దూరమవుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరయ్య తెలిపారు. కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు తమ రక్త గ్రూపు గురించి తెలుసుకోవాలని, అత్యవసర సమయాల్లో అవసరమవుతుందని తెలిపారు. వృక్షశాస్త్ర అధ్యాపకులు పాల్గొన్నారు.


విద్యార్థులకు రక్త పరీక్షలు

ఆధార్ కార్డులో తప్పొప్పులను సరిదిద్దుకోండి

కేవీబీపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని సచివాలయాల్లో ఈనెల 23న బుధవారం ఆధార్‌కార్డులో తప్పొప్పులను సరి చేసుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఎంపీడీవో రాధారాణి తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గంజాయి అంతమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలను సమూలంగా అంతం చేయడమే ప్రభుత్వ పంతమని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో మంగళవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా గంజాయి నిర్మూలనపై పోలీసులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజవర్గంలో గంజాయి నిర్మూలనపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఉక్కుపాదం మోపాలన్నారు. సీఐలు వెంకటేశ్, గోపి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

పొలాల్లో స్టార్టర్ల చోరీ

లబోదిబోమంటున్న రైతులు





ముసలిపేడులో చోరీ అయిన స్టార్టర్ - మేర్లపాకలో స్టార్టర్ చోరీ - పైప్‌ను కట్ చేసి గేట్ వాల్వును ఎత్తుకెళ్లిన దుండగులు

ఏర్పేడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో దొంగల బెడద అధికమైంది. రైతుల పొలాల్లో అమర్చుకున్న బోర్ల స్టార్టర్లను గుర్తు తెలియని దుండగులు చోరీ చేస్తున్నారు.వైర్లు, పైపులు అపహరించుకుపోతున్నారు. దీంతో రైతులు లబోదిబోమంటూ ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో పంటలకు నీరందించ లేపోతున్నారు. ముసలిపేడులో సెప్టెంబరు 26న ఎనిమిది మంది రైతులకు సంబంధించి స్టార్టర్లు చోరీకి గురయ్యాయి. ఆ సమయంలో రైతులు ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే సెప్టెంబరు 30న పాతవీరాపురంలో ఆరుగురు రైతుల స్టార్టర్లు, వైర్లు, పైపులైన్లు అపహరించుకుపోయారు. దీనిపై కూడా పోలీసులకు ఫిర్యాదులు అందాయి. అంతే కాకుండా చిందేపల్లిలో పైపులైన్ల గేట్‌వాల్వులను గుర్తు తెలియని కోసి ఎత్తుకెళ్లిపోయారు. ఇలా రోజురోజుకు స్టార్టర్లు, వైర్లు, పైపులు చోరీ అవుతున్నా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆవేదనం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

13 ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసిన దుండగులు

ఏర్పేడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో రైతులు తమ పొల్లాల్లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని దుండగులు సోమవారం రాత్రి ధ్వంసం చేశారు. అందులోని రాగివైర్లను అపహరించుకుపోయారు. రైతుల సమాచారంలో స్పందించిన ఏఈ వాసుదేవయ్య ఏర్పేడు పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. చింతపాళెం, పల్లం, మేర్లపాక, ఏర్పేడుల్లో 13 ట్రాన్స్‌ఫార్మర్ల ధంసంతో విద్యుత్‌శాఖకు సుమారు రూ.65వేలు నష్టం వాటిలినట్లు ఏఈ తెలిపారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేడాంలో కొలువై ఉన్న దక్షిణ కాళికాదేవి మూలమూర్తిని రాహుకాలంలో పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. మహిళలు దీపాలు వెలిగించి హారతులు పట్టారు. తీర్థ ప్రసాద వినియోగంతో పాటూ మధ్యాహ్నం అన్నదానం జరిగింది.

వేడుకగా ప్రాకారోత్సవం



శ్రీకాళహస్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న కాల భైరవ స్వామికి మంగళవారం ప్రాకారోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ముందుగా కాలభైరవ స్వామి సన్నిధిని శుద్ధి చేశారు. అనంతరం మంగళ వాయిద్యాలు మేళతాళాల మధ్య అభిషేకాలు, ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. కాలభైరవ స్వామి ఉత్సవమూర్తిని మహాద్వారం నుంచి విజయ స్తూపం వరకు ప్రదక్షిణగా తీసుకెళ్లి తిరిగి ఆలయంలో కొలువు తీర్చారు.

ఆంజనేయ స్వామికి....

అలాగే పదహారు కాళ్ల మండపంలో కొలువై ఉన్న ఆంజనేయుడిని వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకించి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం సిందూరం దిద్ది పుష్పాలతో అలంకరించారు. భక్తులు తమల పాకుల మాలలు సమర్పించారు.

జనసేన నేతపై కేసు కొట్టివేత

రేణిగుంట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి జనసేన ఇన్‌ఛార్జి కోట వినుతపై నమోదైన కేసును చిత్తూరు కోర్టు కొట్టివేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2022 రేణిగుంట అర్బన్ పోలీస్‌స్టేషన్ ముందు నిరసన తెలియజేసినందుకు కోట వినుత, ఆమె భర్త చంద్రబాబుపై రేణిగుంట అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా మంగళవారం చిత్తూరు కోర్టులో ఈ కేసును కొట్టివేసినట్లు ఆమె పేర్కొన్నారు.

పన్నులు చెల్లించండి

శ్రీకాళహస్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పురపాలకసంఘానికి సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి తోడ్పాలని కమిషనర్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటిపన్నులు, కొళాయి పన్నులు, ఖాళీ జాగా పన్నులు, మార్కెట్ లీజు, షాపుల బాడుగలను సకాలంలో చెల్లించాలని కోరారు.

భూసమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ

శ్రీకాళహస్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రీసర్వేతో ఉత్పన్నమైన భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని డీటీ జగన్‌మోహన్ అన్నారు. తొట్టంబేడు మండలం సాంబయ్యపాళెంలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ... పలుగ్రామాల్లో రీసర్వే నిర్వహించి పక్కాగా హద్దులు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ మేరకు పైలెట్ ప్రాజెక్టుగా సాంబయ్యపాళెంలో కొద్దినెలల క్రితం రీసర్వే జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా కొత్తగా కేటాయించిన ఎల్‌పీఎం నెంబర్లలో సమస్యలుంటే పరిష్కరించేందుకు గ్రామసభ నిర్వహించామన్నారు. సర్పంచు జగదీశ్వర్‌రెడ్డి, డీఐ రాఘవులు, మండల సర్వేయర్ హరిబాబు, సచివాలయ సర్వేయర్లు సుకన్య, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత




సత్యవేడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితులకు సత్యవేడు టీడీపీ నాయకులు చేయూతనందించారు. అమరావతిలోని సీఎం కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును టీడీపీ మండల అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు పరమశివం మర్యాద పూర్వకంగా కలిసి రూ. 4.38లక్షల చెక్కును అందించారు. మానవతా దృక్పథంతో స్పందించి ఆదుకున్న టీడీపీ నాయకులకు సీఎం అభినందించారు.



వరదయ్యపాళెం: వరద బాధితుల సహాయార్థం మంగళవారం సీఎం చంద్రబాబుకు వరదయ్య పాళెం మండల అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి ఇందిరానగర్ పంచాయతీ టీడీపీ నాయకుడు సుదర్శన్‌రెడ్డితో కలిసి రూ.లక్ష విరాళంగా అందజేశారు. అదేవిధంగా మండలంలోని ఇందిరానగర్ పంచాయతీలో జరిగిన అవకతవకలను సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

పగటి పూట వెలుగుతున్న వీధి లైట్లు



బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీర్పాకోట మైక్రో సెంటర్ కాలనీ, దాసుకాలనీలో వీధి లైట్లు నిత్యం వెలుగుతున్నాయి. లైట్లకు ఆన్‌ఆఫ్ స్విచ్‌లు లేకపోవడంతో నిత్యం వెలుగుతున్నాయి. స్విచ్‌లు ఏర్పాటు చేసి విద్యుత్‌ను ఆదా చాయాల్సి ఉంది.

అబాకస్ పోటీల్లో మనోజ్ ప్రతిభ



శ్రీకాళహస్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కాలనీలో ఉన్న డాక్టర్ కిషోర్స్ రత్నం పాఠశాల 7వ తరగతి విద్యార్థి మనోజ్‌కుమార్ అబాకస్ మెంట్ అరిథ్‌మెటిక్ టీచర్స్ ఇటీవల నిర్వహించిన పోటీల్లో 6వ లెవల్‌లో మొదటి స్థానం సాధించాడు. మనోజ్‌కుమార్‌ను పాఠశాల డైరెక్టర్లు డాక్టర్ కృష్ణకిషోర్, వాసంతి కిషోర్ అభినందించారు.

రేపు కలిక్కం సిద్ధ ఔషధ నేత్ర చికిత్స శిబిరం

వరదయ్యపాళెం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కలిక్కం సిద్ధ ఔషధ నేత్ర చికిత్స శిబిరం జరగనుంది. కొన్ని అరుదైన మూలికల సారాలతో కంటి వ్యాధులు నయమవుతాయని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9.30 నుంచి 11గంటల వరకు శిబిరం జరుగుతుంది.

సంక్షిప్తంగా..

దివ్యాంగులకు అర్థమయ్యే రీతిలో బోధన

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రంలో దివ్యాంగులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఎంఈవో(2) మునిసుబ్రమణ్యం తెలిపారు. దివ్యాంగులను సకలాంగులకు పోటీగా అన్ని రంగాల్లో రాణించే విధంగా తయారు చేయాలన్నారు. వారిలో ఉన్న నైపుణ్యాలను వెలికి తీయాలన్నారు. ఉపాధ్యాయులు అయ్యప్పరెడ్డి, నయోమి తదితరులు పాల్గొన్నారు.

వరిలో కాలి బాటలు వదలండి

వ్యవసాయ అధికారుల సూచన

వరదయ్యపాళెం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు కోరారు. మండలంలోని అరుదూరు, కడూరు గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ... వరిలో కాలి బాటలను ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల చొప్పున వదులు కోవాలన్నారు. నారు కొనలు తుంచి నాటుకోవడం ద్వారా కొంత వరకు ఆకుముడత తెగులు నివారించవచ్చన్నారు. నాగళ్లు, స్ప్రేయర్లు, టార్పాలిన్ పట్టాలను రాయితీపై అందించాలని రైతులు కోరారు. సత్యవేడు వ్యవసాయ సహాయ సంచాలకుడు సుబ్రహ్మణ్యం, ఏవో ద్వారకానాథ్, విస్తరణ అధికారి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపంతో వ్యాధులకు అవకాశం

వరదయ్యపాళెం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవర్ధనపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రపంచ అయోడిన్ దినాన్ని ప్రజాప్రగతిట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు రాజారెడ్డి, సుధీర్‌గాంధీ పాల్గొని అయోడిన్ ప్రాముఖ్యతను, లోపం వల్ల వచ్చే వ్యాధులను వివరించారు. ప్రధానోపాధ్యాయుడు రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఒకరి అరెస్టు

వరదయ్యపాలెం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వలస కార్మికుడి హత్య కేసులో నిందితుడు విక్రమ్ ముర్మును అరెస్టు చేసినట్లు శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు తెలిపారు. శ్రీసిటీలోని ఓ కంపెనీలో పనిచేస్తున్న జార్ఖండ్ రాష్ట్రం బాద్యాకు షికారి ముర్ముపై విక్రమ్ ముర్ము దాడి చేయడంతో మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై కేసు నమోదు చేసిన శ్రీసిటీ పోలీసులు పరారీలో ఉన్న విక్రమ్ ముర్మును మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.